జన రాజకీయం కోసం ...

₹ 10/-


# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 4 పక్షపత్రిక ఫిబ్రవరి 16- 29, 2016







## జీహెచ్‌ఎంసీ సాంప్రదాయ రాజకీయ రేసులో గెలుపు గుర్రం తెరాస, మట్టికరిచిన కాంగ్రెస్, తెదేపా, బీజేపీ





# ప్రజా జీవితాన్ని ప్రక్షాళన చేస్తేనే హనుమంతప్పలాంటి వీరుల త్యాగాలకు విలువ

మనందరి క్షేమం కోసం కొద్దిమంది త్యాగాలు చేస్తున్నారనే విషాదాన్ని లాన్స్‌నాయక్ హనుమంతప్ప మృతి గుర్తుచేస్తోందంటూ లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ వీరజవానులందరికీ వందనా లర్పించారు.

మన రక్షణ కోసం, మన జీవితాల్ని మెరుగుపరచటం కోసం సైనికులు, పోలీసులు, ప్రజాప్రయోజనాల కోసం నిజంగా పోరాడే నాయకులు తమ బతుకుల్ని ఫణంగా పెడుతున్నారని జేపీ అన్నారు.

అత్యుత్తములను ప్రజాసేవలోకి వచ్చేలా చేయటం, వారి నిజమైన త్యాగాన్ని విజయాన్ని గుర్తించటం ద్వారా మాత్రమే ఒక దేశం సుస్థిర మనగడను సాగించగలుగుతుందని, గొప్పదేశంగా ఎదగగలుగుతుందని జేపీ అన్నారు.

అధికార దాహంతో బరితెగిస్తున్నవారు, నాయకుల ముసుగులో వయవంచనలకు పాల్పడుతున్నవారు, అవినీతి ఉద్యోగులు ప్రజాసేవ అన్న పదానికే మచ్చ తెచ్చారని, ప్రజాజీవితాన్ని ప్రక్షాళన చేయాల్సిన సమయమిదని జేపీ అన్నారు.

మన స్వతంత్ర సమరయోధుల, జవానుల, అనేకమంది ధీరోదాత్తుల త్యాగాలు వృథా కాకూడదని, సమాజాన్ని ఫణంగా పెట్టి వ్యక్తిగత లబ్ధి పొందే ధోరణులను తుదముట్టించాలని జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఫిబ్రవరి 16-29, 2016

సంపుటి - 7 సంచిక - 4

## లోపలి పేజీల్లో...

కులాల మధ్య చిచ్చురేపిన చంద్రబాబు .......... 5
రిజర్వేషన్లపై నటిస్తున్న ప్రభుత్వాలకు ............ 6
రిజర్వేషన్లతోనా రాజకీయాలు.................... 8
జీహెచ్ఎంసీ సాంప్రదాయ రాజకీయ రేసులో ...10
హైదరాబాదీలను గెలిపించే స్థానిక స్వయం..... 14
పంచాయతీలకు అధికారాలిస్తేనే రాష్ట్రాలకు .... 16
స్థానిక ప్రభుత్వాల ఏర్పాటుకి లోక్‌సత్తా కృషి.... 17
తొలి సంతకం ఎప్పుడు చేస్తారు.................. 20
జికా వైరస్‌తోనైనా స్వచ్ఛ భారత్ తీరు మారేనా..22
నీతి ఆయోగ్ జమానాలోనూ అందరికీ .......... 23
న్యాయ సంస్కరణల కోసం 35 రోజుల ......... 25
నమోదులు, డ్రాపవుట్లే వీరి చదువు............. 26
తోపుడు బండి పుస్తక యాత్ర..................... 27
ఆరాటం అసలుకు ముప్పు........................ 28
నీతి ఆయోగ్‌తో రైతుల హక్కులకు భంగం ...... 30
ప్రధాని పంటల బీమా అమలుకు ................ 32
చంద్రన్న కానుక అంటే మురుగు బెల్లమా?....... 33
ఓటింగ్, షాటింగ్ స్థాయికి దిగజారిన భారత... 34

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం


బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# మార్పు కోసం 'మరో ప్రయత్నం'లో పాల్గొన్న వారందరికీ అభినందనలు



**2016** గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పరిమిత సంఖ్యలోనే పోటీచేసినా లోక్‌సత్తా అభ్యర్థులు చేసిన పోరాటం ఎంతో విలువైనది. ఒక ఉత్తమ ప్రజాస్వామిక సమాజంలో రాజకీయ పార్టీ చేయవలసినవన్నీ లోక్‌సత్తా వారు ఈ ఎన్నికల్లో చేశారు. నిజాయతీగా సమకూర్చుకున్న డబ్బు, వలంటీర్లు, ఇతర వనరులు సరిపోకపోయినా వీలున్నంతమేర ప్రయత్నం చేశారు. భావసారూప్యమున్న వామపక్షాలు, అత్యంత వెనకబడిన వర్గాల వారితో కలిసి పోరాడారు. ప్రపంచస్థాయి సామర్థ్యమున్న జీహెచ్ఎంసీలాంటి ఒక స్థానిక ప్రభుత్వానికి తగ్గ కనీస ఎజెండాను రూపొందించి ప్రజల్లోకి తీసుకెళ్లటంలో లోక్‌సత్తా అభ్యర్థులు, నేతలు విజయం సాధించారు. ఈ స్థానిక సాధికారతతో మూడో అంచె ఫెడరలిజాన్ని బలోపేతం చేయటం ఇప్పుడు మనదేశానికి అత్యంత ఆవశ్యకం. కానీ తాత్కాలిక ప్రయోజనాలు, సమాజంలో బాధ్యత తీసుకోని సమర్థులు, భావోద్వేగాలు-తాత్కాలిక ధోరణులతో సాధారణ ప్రజల్ని చీల్చిన రాజకీయం మధ్య లోక్‌సత్తా అభ్యర్థులు భారీ ఓటమి పాలయ్యారు. తమ వ్యక్తిగత లాభాలను పక్కనబెట్టి తీవ్ర ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా ప్రజలను గెలిపించే రాజకీయం చేసేవారు ఆ ప్రజల చేతిలోనే తిరస్కారానికి గురైతే క్షోభ ఎంత తీవ్రంగా ఉంటుందో నాకు తెలుసు. కానీ తప్పదు. ఎవరోకరు చేయాల్సిన పనిని చేసే అవకాశం ఈదేశంలో మనకి వచ్చింది. దీర్ఘకాలిక పోరాటానికి సిద్ధపడే వచ్చాం. హైదరాబాద్ క్షేత్రంగా చాలా పని చేశాం... ఈ ఓటమి చివరిదీ కాకపోవచ్చు, లేదా వచ్చే ఎన్నికే మార్పునకు నాంది కావచ్చు. ప్రజలు మంచి రాజకీయం వల్ల ప్రయోజనాన్ని, తమ శక్తిని తెలుసుకుని తల్చుకుంటే ఒక్కరోజులో చరిత్ర మారిపోతుంది. జీరో పార్టీ హీరో అయిపోతుంది. ఈ ఎన్నికల్లో నేను ప్రత్యేకించి ప్రచారం చేయలేదుగానీ, కొన్ని చోట్ల కార్యక్రమాల్లో పాల్గొన్నాను. లోక్‌సత్తా ఎజెండాకు మాత్రం చాలా గొప్ప స్పందన కనిపించింది. ఇది అవసరం, ఇది జరిగితే బాగుండును అనే తపన చాలామంది కళ్లల్లో చూశాను. వంశపారంపర్య రాజకీయాలకు భిన్నంగా లోక్‌సత్తాలో యువత పోటీచేయటం పట్ల చాలామందిలో ఉత్సుకత కనిపించింది. అందుకే ఇంతకంటే కఠిన పరిస్థితుల మధ్యే పోరాటాన్ని ప్రారంభించిన మనం.. ఈ ఎన్నికల ఫలితాలతో ప్రభావితం కాకుండా ప్రజల కోసం పనిచేయాల్సి ఉంది. అధికారం వస్తే చాలా చేయగలం, కానీ అధికారానికి ఆవల కూడా చాలా చేయాల్సింది ఉంది. వనరులున్న నేతలు, వలంటీర్లు కాస్త ఎక్కువ బాధ్యత తీసుకున్నా, మిగిలినవారు తమ వ్యక్తిగత జీవితాల్ని తీసుకుంటూ, మిగిలిన సమయంలో పరిమిత వనరుల మధ్య అపరిమిత లక్ష్యాల్ని ఎలా ఛేదించాలో సరైన ప్రణాళికతో రాజీలేకుండా పనిచేయాలి. లోక్‌సత్తాను తిరస్కరిస్తున్నవారు కూడా లోక్‌సత్తా తప్ప పరిష్కారం లేదని, లోక్‌సత్తా చేస్తున్నది తప్ప మార్గం లేదని అంగీకరిస్తున్నారు. అందుకే ఈ పోరాటాన్ని ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటూ వీలైనరీతిలో కొనసాగిస్తూనే ఉండాలి. అది పూర్తిగా ఆచరణ సాధ్యం కూడా. కృషికి తగ్గ ఫలితాలను సాధ్యమైనంత త్వరగా చూడగమని ఆశిద్దాం. జీహెచ్ఎంసీలో కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లందరికీ, వారి కంటే కూడా ఈ ఎన్నికల్లో లోక్‌సత్తా గెలుపు కోసం నిజాయతీగా కష్టపడి పనిచేసినవారందరికీ మనస్ఫూర్తిగా అభినందనలు చెబుతున్నాను.



# కార్టూన్ కార్నర్




## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# కాపుల రిజర్వేషన్ పేరుతో కులాల మధ్య చిచ్చురేపిన చంద్రబాబు : లోక్‌సత్తా

**"మంత్రులు, ఎంపీలు, కలెక్టర్ల పిల్లలకు కాకుండా అణగారిన కులాల్లో అర్హులకు మాత్రమే రిజర్వేషన్లు అందించటం, రిజర్వేషన్ల పరిధిలోకి రాని కులాల్లో పేదలకు పోటీ పరీక్షల్లో 10శాతం అదనపు మార్కులు కలపటం వంటి సంస్కరణల్ని తీసుకురావాలి. దీనివల్ల ఇప్పుడున్న 50శాతం రిజర్వేషన్లు కొనసాగుతూనే అన్ని కులాలకూ శాశ్వత పరిష్కారం లభిస్తుంది, అందరికీ ఎదిగే అవకాశాలు లభిస్తాయి"**



కాపులను బీసీల్లో, రిజర్వేషన్ల పరిధిలో చేర్చాలన్న డిమాండ్‌ను 2014 ఎన్నికల్లో ఓట్ల కోసం వాడుకుని చిచ్చు రేపింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడేనని, ఈ సంక్షోభానికి ఆయనే ప్రధాన బాధ్యత తీసుకుని పరిష్కరించాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు.

రిజర్వేషన్లకు పరిమితి ఉందని తెలిసినా, కాపులతో పాటు అన్ని కులాల్లోనూ పేదలున్నారని తెలిసినా, అందరికీ న్యాయం చేసేలా సామరస్యంగా పరిష్కరించే ప్రయత్నం చేయకుండా ఎన్నికల్లో లబ్ధి కోసం చంద్రబాబు కులాల కుంపటిని రాజేశారని బాబ్జీ అన్నారు. తూర్పు కాపులు-కాపులు, కాపులు-బీసీల మధ్య చిచ్చు పెట్టారన్నారు. జనవరి 31న తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన 'కాపు ఐక్య గర్జన'లో హింస చెలరేగటానికి ఎవరినో బాధ్యుల్ని చేసే ముందు చంద్రబాబు తన రాజకీయ అవకాశవాదం, అవగాహనారాహిత్యంతో చేసిన తప్పుల్ని ఒప్పుకోవాలన్నారు.

రిజర్వేషన్ల చుట్టూ పెరుగుతున్న వివాదాల్ని పరిష్కరించటంలో ఆలస్యమయ్యేకొద్దీ రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవస్థలు మూల్యం చెల్లించాల్సి వస్తుందని మాల-మాదిగల మధ్య వర్గీకరణ వివాదం, పలు రాష్ట్రాల్లో గుజ్జర్లు-మీనాలు తదితరుల ఆందోళనల నేపథ్యంలో చాలాకాలంగా లోక్‌సత్తా హెచ్చరిస్తూ నిర్దిష్ట పరిష్కారాన్ని సూచిస్తోందని బాబ్జీ గుర్తుచేశారు. **"మంత్రులు, ఎంపీలు, కలెక్టర్ల పిల్లలకు కాకుండా అణగారిన కులాల్లో అర్హులకు మాత్రమే రిజర్వేషన్లు అందించటం, రిజర్వేషన్ల పరిధిలోకి రాని కులాల్లో పేదలకు పోటీ పరీక్షల్లో 10శాతం అదనపు మార్కులు కలపటం వంటి సంస్కరణల్ని తీసుకురావాలి. దీనివల్ల ఇప్పుడున్న 50శాతం రిజర్వేషన్లు కొనసాగుతూనే అన్ని కులాలకూ శాశ్వత పరిష్కారం లభిస్తుంది, అందరికీ ఎదిగే అవకాశాలు లభిస్తాయి"** అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇంకా కులరాజకీయాలు చేయకుండా రిజర్వేషన్లపై లోక్‌సత్తా పరిష్కారం ప్రాతిపదికన చర్చిస్తే కాపుల రిజర్వేషన్ అంశాన్ని పరిష్కరించవచ్చని బాబ్జీ అన్నారు.

కాపు ఆందోళనకారులు తమ డిమాండ్‌పై ఐక్య గర్జన సభలో తీర్మానం చేసి ప్రభుత్వానికి కొంత గడువు ఇచ్చి ఉంటే బాగుండేదని, హింసకు దిగి ప్రభుత్వాస్తులను ధ్వంసం చేయటం మన వేళ్లతో మన కళ్లు పొడుచుకోవటమేనని, రిజర్వేషన్లపై లోక్‌సత్తా పరిష్కారం మీద కాపు నేతలు సహా అన్ని కులాలవారూ, పార్టీలవారూ సానుకూలంగా ఆలోచించాలని భీశెట్టి బాబ్జీ విజ్ఞప్తి చేశారు. ❍

# రిజర్వేషన్లపై నటిస్తున్న ప్రభుత్వాలకు కాపు ఆందోళన మరో వార్నింగ్

- కూసంపూడి శ్రీనివాస్

తెలుగుదేశం ప్రభుత్వం కాపు కులస్తులకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జనవరి 31న ముద్రగడ పద్మనాభం నాయకత్వంలో తునిలో జరిగిన కాపు గర్జన సభ సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్త సంఘటనలతో ఆంధ్రప్రదేశ్ ఉలిక్కిపడింది. గతంలో రాష్ట్ర విభజన నేపథ్యంలో కూడా ఎన్నో ఉద్యమాలు, ధర్నాలు, రాస్తారోకోలు జరిగినా రైలు దహనాలు లాంటి తీవ్రస్థాయి ఘటనలు జరగలేదు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం కూడా ఈ అలజడులను ముందే ఊహించలేకపోయింది. ముద్రగడ లక్షలాది మందితో తునిలో కాపు గర్జన నిర్వహిస్తామని రెండు నెలలకు ముందే ప్రకటించినా ప్రభుత్వం అంత సీరియస్‌గా తీసుకోలేదు. ఈ సభకి ప్రభుత్వం అనుమతి నిరాకరించడం, కొద్దిపాటి భద్రతా సిబ్బందినే నియమించడం, సభాకార్యక్రమాలు ప్రసారం చేయకుండా మీడియాను కట్టడి చేయటం వంటివి చేసిందనే అనుమానాలు ఉండటంతో కాపుల కోపం తారాస్థాయికి చేరుకుంది. అదేరోజు మీడియా సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఘటన వెనక విద్రోహశక్తులు ఉన్నాయని ప్రకటించడం గమనార్హం. తుని ఘటన తర్వాత స్పందించిన జనసేన నేత పవన్ కళ్యాణ్ తాను ఒక కులం కోసం పోరాడనని, ప్రజల కోసం పోరాడతానని నర్మగర్భంగా ప్రకటించారు. ఆయన ప్రకటనతో మనస్తాపం చెంది కాకినాడకు చెందిన చీకట్ల వెంకటరమణమూర్తి అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన తన సూసైడ్ నోట్‌లో పవన్ కళ్యాణ్ కాపులకు ఏదో న్యాయం చేస్తారని ఆశించా కానీ, మాకు ఎదురుచూపే మిగిలింది అని పేర్కొన్నారు. ఆ బలవన్మరణం తర్వాత రాష్ట్రంలో పరిస్థితులు మరింత వేడెక్కాయి. ముద్రగడ ఫిబ్రవరి 4వ తేదీ వరకు ప్రభుత్వానికి గడువు విధించారు. ఈలోపు ప్రభుత్వం స్పందించి ఎన్నికల సందర్భంలో కాపులకు ఇచ్చిన హామీలను నెరవేర్చని పక్షంలో 5 నుంచి తన భార్యతో కలిసి కిర్లంపూడిలోని తన స్వగృహంలో ఆమరణ దీక్ష చేపడతానని ప్రకటించారు. ప్రభుత్వం తరపున తోట త్రిమూర్తులు, బండా ఉమా, బొడ్డు భాస్కర రామారావు బృందం ముద్రగడతో చేసిన చర్చలు విఫలమవటంతో ముద్రగడ తన భార్య పద్మావతితో కలిసి నిరాహారదీక్ష ప్రారంభించారు. వారి దీక్షకు కాంగ్రెస్, వైకాపా లాంటి ప్రతిపక్ష పార్టీలు, రాష్ట్రవ్యాప్తంగా కాపు సంఘాలు మద్దతు పలికాయి. లోక్‌సత్తా పార్టీ కూడా కాపుల రిజర్వేషన్ పేరుతో కులాల మధ్య చంద్రబాబు చిచ్చు రేపారని విమర్శిస్తూ, శాశ్వత పరిష్కారాన్ని సూచించింది. మరోపక్క కాపులను బీసీలలో చేరిస్తే ఉద్యమిస్తానని బీసీ సంఘాలు ప్రభుత్వాన్ని హెచ్చరించాయి.

ముద్రగడ దంపతులు నాలుగురోజులు దీక్షలో పాల్గన్నారు. రోజురోజుకీ వారి ఆరోగ్యం క్షీణించడంతో ఈ నాలుగు రోజులు రాష్ట్రవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యమంత్రి తన సహచర కాపు సామాజికవర్గ మంత్రులతో నిరంతరం చర్చలు జరిపారు. ఆఖరికి 8వ తేదీ మధ్యాహ్నం ప్రభుత్వం తరపున చర్చలకు వచ్చిన మంత్రి అచ్చెన్నాయుడు, కళా వెంకట్రావు, తోట త్రిమూర్తులు, బడ్డు భాస్కరరామారావు తదితరులు మరోసారి ముద్రగడతో చర్చలు జరిపి కాపు రిజర్వేషన్ల కోసం నియమించిన కమిటీ గడువు కేబినెట్ నిర్ణయం నుంచి 9 నెలలుగా ఉంటుందని చెప్పారు. ఇప్పటికే 2 నెలలు గడిచిపోయినందున కమిషన్ మరో 7 నెలల్లో నివేదిక ఇవ్వాల్సి ఉంటుందని ముద్రగడకు వివరించారు. కాపు కార్పొరేషన్‌కు ఈ ఏడాది రూ.500కోట్లు ఇస్తామని తెలిపారు. ప్రతి బడ్జెట్‌లోనూ రూ.1000 కోట్లు కేటాయిస్తామన్నారు. కాపు కార్పొరేషన్‌లో ముద్రగడ సూచించిన వ్యక్తికి పదవి కల్పించే విషయంలో ఆయన ప్రతిపాదనను పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యమంలో జరిగిన గొడవల్లో పాల్గన్న వ్యక్తులపై కేసులు ఉండవని చెప్పారు. తుని ఘటనపై లోతుగా దర్యాప్తు చేసిన తర్వాతే అరెస్టులు ఉంటాయన్నారు. అమాయకులపై కేసులుండవన్నారు. మేనిఫెస్టోలో పెట్టిన విషయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. కాపు సామాజిక వర్గం డిమాండ్లపై తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. ఈ చర్చలు సఫలమవడంతో ముద్రగడ దీక్ష విరమించారు.

అసలు కాపుల ఆగ్రహానికి అసలు కారణం చంద్రబాబు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను విస్మరించడమేనన్నది వాస్తవం. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు రాష్ట్రంలో అధిక సంఖ్యాకవర్గమైన కాపులను బీసీలలో చేరుస్తామని హామీ ఇచ్చి 18 నెలలు గడచినా ఆ హామీ నెరవేర్చకపోగా ఇప్పుడు రూ.100 కోట్లతో కాపు కార్పొరేషన్ అంటూ కొత్త కార్పొరేషన్‌ని ఏర్పాటు చేసి దానికి కృష్ణా జిల్లాకు చెందిన తెదేపా నాయకుడు చలమలశెట్టి రామాంజనేయని ఛైర్మన్‌గా నియమించి చేతులు దులుపుకోవడమే వారి ఆగ్రహానికి కారణమైంది. రాష్ట్రంలో అధికసంఖ్యలో ఉన్న కాపులని కేవలం ఓటుబ్యాంకుగానే గుర్తిస్తున్నారుగానీ వారికి ఎన్నాళ్ల నుండో ఇచ్చిన బీసీలలో చేరుస్తామన్న హామీగానీ, రిజర్వేషన్లను కల్పించే హామీగానీ నెరవేర్చడం లేదని కాపులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

నిజానికి రాష్ట్ర రాజకీయాలను చూస్తే బలమైన

సామాజికవర్గమైన కాపులకు అన్యాయమే జరిగిందని చెప్పవచ్చు. సంఖ్యాబలంతో రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పగల సామర్థ్యం ఉన్నా, వారిలో ఉన్న అనైక్యతని తమకి అనుగుణంగా కొన్ని వర్గాలు మలచుకుంటున్నాయని కాపు నాయకులే చెబుతున్నారు. కాపుల్ని సంతృప్తి పరచడానికి ఆ వర్గానికి చెందిన ఒకరిద్దరు నాయకులకు మంత్రి పదవులు ఇవ్వడం, వారి సంక్షేమానికి ఓ వందకోట్లు ఇస్తున్నామని ప్రకటించడం తప్ప తెదేపా కూడా కాపులకు చేసిందేమీ లేదు. 2009 ఎన్నికల్లో కాపు సామాజిక వర్గానికి చెందిన సినీ నటుడు చిరంజీవి నాయకత్వంలో ఉప్పెనలా వచ్చిన ప్రజారాజ్యం పార్టీ వల్ల అప్పట్లో సీఎం పీఠాన్ని చంద్రబాబు కోల్పోవలసి వచ్చింది. అయితే 2014లో పవన్ కళ్యాణ్ మద్దతుతో తిరిగి ముఖ్యమంత్రి పీఠాన్ని చంద్రబాబు దక్కించుకున్నారు. ఇది పవన్‌కున్న సినీ గ్లామర్‌తోపాటు కాపు ఓట్లు కూడా చంద్రబాబుకి మద్దతు ఇవ్వడం వల్లనే సాధ్యపడిందనే విషయం తెదేపా నాయకులనే పలు సందర్భాలలో ఒప్పుకున్నారు. ఇంత బలమైన వర్గం కూడా తమకు ఇచ్చిన హామీపై తెదేపాని నిలదీయడంలో విఫలమవడానికి కారణం కొంతమంది స్వార్థ కాపు నాయకులేనన్నది అందరికీ తెలిసిందే.

నిజానికి 1910 నుంచి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ప్రారంభమైన మాంటేగ్-చెమ్స్‌ఫోర్డ్ సంస్కరణల నివేదిక 1919, భారత ప్రభుత్వ చట్టం 1935లో కొనసాగి, 1953 అక్టోబర్ 1 వరకు కాపు, బలిజ, ఒంటరి మిగిలిన 20 ఉప కులాలకు ప్రత్యేక జాబితాగా (ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో), తెలంగాణలో (హైదరాబాద్ రాష్ట్రం) మరొక ప్రత్యేక జాబితాగా కాపులకు రిజర్వేషన్లు కొనసాగాయి. అయితే 1956 తెలుగు ప్రజలకు ఆనాటి పరిస్థితులలో పండగకాగా, కాపు ప్రజలకు విషాదాన్ని మిగిల్చింది. విడదీసి పాలించే సూత్రాన్ని అమలు చేశారు. 1956లో నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దేశంలో ఎక్కడా లేని విధంగా ఏ విధమైన కమిషన్, కమిటీ సిఫార్సులు లేకుండానే కోస్తా కాపు, బలిజ, ఒంటరి, తెలగ, గాజుల బలిజలను రిజర్వేషన్ల జాబితా నుంచి తప్పించారు. కొసమెరుపుగా కోస్తా కాపుల నుండి తూర్పు కాపులకు, తెలంగాణలో మున్నూరు కాపులకు మాత్రం రిజర్వేషన్లు కొనసాగించేలా కుట్రపన్ని దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే కులస్తుల్ని కొన్ని ప్రాంతాల్లో ఓసీలుగా, మరికొన్ని ప్రాంతాల్లో బీసీలుగా గుర్తించారు. ఆ తర్వాత కాపులు చేసిన అనేక పోరాటాల ఫలితంగా కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1994లో జీవో నెంబరు 30 విడుదల చేసి కాపులకు రిజర్వేషన్లు కల్పించారు. ఆ జీవోని హైకోర్టు సమర్థించినా దాన్ని అమలుచేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. ఆ జీవోని వ్యతిరేకిస్తూ బీసీ సంఘాలు కోర్టుల్లో అనేక వ్యాజ్యాలు వేశాయి. అయినా కూడా 1994-95లో ఇచ్చిన హైకోర్టు తీర్పుని అమలు చేయాలని జనవరి 5,2007న జస్టిస్ రోహిణి నేతృత్వంలో తీర్పు వెలువడింది. ఆ తీర్పునికూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. అదే ఇప్పుడు ఇంచుమించు రాష్ట్ర జనాభాలో 27శాతంపైగా ఉన్న కాపుల ఆగ్రహానికి కారణంగా మారింది.

అసలు కాపులకు కావలసింది రిజర్వేషన్లేనా? బీసీలలో చేర్చడమా? అన్నది ఇప్పుడు అందరి ముందూ ఉన్న అసలు ప్రశ్న. కాపులను ఎ,బి,సి,డి విభాగాల్లో ఎక్కడ ఉంచాలో ఈనాటికీ రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టత లేదు. నిజానికి కాపులకు కావలసింది రిజర్వేషన్లేగానీ, బీసీల్లో కాపుల్ని చేర్చాలనే అర్థరహితమైన వాదనలు కాదనేది కొందరి కాపు నాయకుల వాదన. ఈనాటికైనా కొంతమంది కాపు నాయకులు కోరుతున్నట్టు కాపుల్ని బీసీల్లో చేర్చమనే వాదనను వదిలి, ముస్లింలకు వర్గీకరించిన విధంగా 'ఇ' కేటగిరి వలె 'ఎఫ్' కేటగిరిని ప్రత్యేకంగా కాపు కులస్తులకు కేటాయించే విధంగా ప్రయత్నించాలని వారు వాదిస్తున్నారు. జనాభా, దామాషా ప్రాతిపదికన తమకు దక్కాల్సిన రిజర్వేషన్లను ప్రత్యేకంగా సాధించుకోవాలని వారు కోరుతున్నారు.

ఈ ప్రమాదకర పరిణామాలను ముందే పసిగట్టిన లోక్‌సత్తా పార్టీ అనేకమార్లు ప్రభుత్వాన్ని హెచ్చరించింది. వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం కాపులతోపాటు 17sకులాలను బీసీల్లో చేర్చే అంశాన్ని అధ్యయనం చేయటానికి కమిషన్ వేసినప్పుడు 2007, డిసెంబర్ 20న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ స్పష్టమైన ప్రకటన చేస్తూ, 'కాపులలో పేదరికం చాలా ఉందని, అణచివేతకు గురయ్యారని, అయితే మిగిలిన ఓసీ కులాల్లో కూడా ఈ పరిస్థితి ఉన్నందున అందరూ రిజర్వేషన్లనే పరిష్కారంగా భావిస్తే సమాజంలో కులాల కుంపటి రగలి నష్టపోతామని, కాబట్టి ఇప్పుడున్న రిజర్వేషన్లను అర్హులకు అందేలా సంస్కరించి యధాతథంగా కొనసాగిస్తూనే, కాపులు సహా అన్ని కులాల్లో పేదలకు న్యాయం చేసేందుకు రిజర్వేషన్ల తరహాలో 10శాతం మార్కుల రాయితీ ఇవ్వటం వంటి కొత్త పరిష్కారాన్ని అమలు చేయాలని' డిమాండ్ చేశారు. మాల-మాదిగల మధ్య వివాదం, గుజ్జర్లు-మీనాల ఘర్షణ, పటేళ్ల ఉద్యమం ఇలా ప్రతిసారీ లోక్‌సత్తా రిజర్వేషన్లను సంస్కరించాలని శాశ్వతంగా కులాల ఘర్షణని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూనే వచ్చింది. లోక్‌సత్తాలా రిజర్వేషన్లపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించే సాహసాన్ని దేశంలో ఏ పార్టీ చేయలేకపోవటం దురదృష్టకరం. లోక్‌సత్తా పరిష్కారాన్ని ఇప్పుడు 'కులాలకు ఓట్లు రాలవు' అని కపటనీతులు వల్లిస్తున్న చంద్రబాబు కూడా పట్టించుకోలేదు. కాపుల ఓట్ల కోసం నాటకమాడి ఇప్పుడు మాట మారుస్తున్నారు. ఇప్పటికైనా రిజర్వేషన్లపై శాస్త్రీయ అధ్యయనంతో స్పష్టమైన సంస్కరణలు తీసుకొచ్చి అన్ని కులాల్లో పేదలకు న్యాయం చేసేలా శాశ్వత పరిష్కారాన్ని అమలు చేయకపోతే కులాల కురుక్షేత్రం మొదలై అందరూ తగు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కాపుల ఆందోళన ఆంధ్రప్రదేశ్ నుంచి ఢిల్లీ దాకా ప్రభుత్వాలను హెచ్చరిస్తోంది. ❍

# రిజర్వేషన్లతోనా రాజకీయాలు?

- డా॥ జయప్రకాష్ నారాయణ్

కేంద్ర విద్యాసంస్థల్లో 27శాతం సీట్లను ఇతర వెనకబడిన తరగతులకు ప్రత్యేకించాలన్న ఇటీవల ప్రతిపాదన తీవ్రస్థాయి చర్చను రేకెత్తించింది. రిజర్వేషన్ కారణంగా ఒక సామాజికవర్గం నష్టపోతే మరో సామాజికవర్గం లాభపడుతుంది. దాంతో సమాజం నిలువునా చీలిపోతుంది. పక్షపాతం, ద్వేషభావనలతో కాకుండా వాస్తవాల ఆధారంగా తార్కిక దృక్పథంతో ఈ సమస్యపై చర్చ జరపాలి. నేపథ్యాన్ని పరిగణలోకి తీసుకొని లోతుగా విశ్లేషించాలి.



**సమాన అవకాశాలు ఏవీ ?**

దీనిపై ఒక నిర్ణయానికి వచ్చేముందు మనం మూడు కీలక అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. మొదటిది– నేటికి కూడా అనేక సందర్భాలలో కులం, కుటుంబం, లింగాన్ని బట్టి శిశువు భవిష్యత్తు నిర్ణయమైపోతోంది. ప్రతిభాసామర్థ్యాలు, కృషి, పట్టుదలతో సంబంధం లేకుండా పుట్టుకే ప్రామాణికం కావడం ఆధునిక నాగరిక సమాజానికి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. అణగారినవర్గాలకు చెందిన పేదపిల్లలు ఇతరుల్లాగే మంచి మేధస్సు, తెలివితేటలుగలవారే అయినా వారి శక్తిసామర్థ్యాలకు తగిన అవకాశాలు లభించడం లేదు. ఫలితంగా మన సమాజంలోని మేధోసంపద వృథా అవుతోంది. అన్ని వర్గాలూ లాభపడేలా సమసమాజంలోని ఆధునిక, మానవీయ దృక్పథంతో సకల సామాజిక వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తేనే అధిక పెరుగుదలస్థాయి స్థిరంగా కొనసాగుతుంది. సమానత–సావకాశాలను పెంపొందించి, శాంతిసామరస్యాలను పరిరక్షించడానికి గట్టి కార్యాచరణ విధానాలను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే సామాజిక న్యాయసాధనకు హింసే మార్గంగా మారుతుంది. సమానత, సామాజిక సామరస్యం అవిభాజ్యం.

రెండోది– సామాజిక న్యాయం, సావకాశాలు కల్పించే సందర్భంగా ప్రతిభాసామర్థ్యాల కోసం కూడా మనం అన్వేషించాలి. ఆధునిక సమాజంలో.. ఆర్థిక, సేవ, పరిపాలన రంగాల్లో పురోగతి సాధ్యపడాలంటే సమర్థత, సరైన పనితీరు కీలకం. గొప్ప పనితీరు కోసం గట్టి కార్యాచరణ పథకాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది. మూడోది– గట్టి కార్యాచరణ విధానాలు లేకపోతే యువత సగౌరవంగా తలెత్తుకోలేదు. సరైన అవకాశాలు పొందజాలదు. అవకతవకలు, అక్రమాలు ఎన్నయినా జరిగి ఉండవచ్చుగాక– రిజర్వేషన్ల వల్ల ప్రజానీకం లబ్ధి పొందినమాట నిజం. అవకాశాలు లభించినప్పుడు వారిలోనే అనేకమంది మంచి పనితీరు కనపరిచారు. అదేసమయంలో, రిజర్వేషన్ల వల్ల ప్రయోజనాలు అందరికీ సమానంగా చేకూరలేదు. ప్రత్యేక ప్రాధాన్యం పొంది పైకి ఎదిగిన కుటుంబాలు పేద, నిరక్షరాస్య కుటుంబాలకన్నా పైచేయి సాధించాయి.

ఈ సమస్య ఎంతో సంక్లిష్టమైనది, పైగా వక్రీకరణలూ జరుగుతున్నాయి. దాంతో ఉభయవర్గాల్లోనూ అసంతృప్తి నెలకొంది. కొద్దిమందికే ప్రయోజనం దక్కడం, విద్యాఉపాధి అవకాశాలు తగినంతగా లేకపోవడంతో మోసపోతున్నామని పేద ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు భావిస్తున్నారు. తమ పట్ల వివక్షణ చూపుతున్నారని, తమ అవకాశాలు తగ్గిపోతున్నాయని ఇతర వర్గాల్లోని పేదలు అభిప్రాయపడుతున్నారు. నాణ్యమైన చదువు కోసం ఎందరో అర్రులు చాస్తున్నారు. దాంతో ఉన్నతస్థాయి విద్యాసంస్థల్లో సీట్ల అందుబాటు, ఎంపిక ప్రక్రియ వివాదాస్పదమవుతున్నాయి.

సమర్థతతోపాటు సమన్యాయాన్నీ పెంపొందించగలమా?

ప్రతిభను, సామాజిక న్యాయాన్నీ ఒకే గాటన కట్టగలమా? అందరికీ లబ్ధి చేకూర్చేందుకు వీలుగా ప్రాధాన్య విధానాలను సవరించుకోగలమా? ఈ సంశయాలకు సహేతుక సమాధానాలు సిద్ధంగానే ఉన్నాయి. విధానకర్తలు, సమాచార మాధ్యమాలు సంచలనాలకు పాల్పడే బదులు వాటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రాజకీయ ఉద్దేశాలు, సామాజిక వివక్ష, ఆగ్రహావేశాలను విడనాడాలి. హేతుబద్ధంగా ఆలోచించాలి. వివేకంతో వ్యవహరించాలి. దీర్ఘకాలిక పరిష్కారాలే లక్ష్యం కావాలి. అందుకోసం మనం చేయవలసిందేమిటి? ఆయా వర్గాల వారికి మేలు చేకూర్చే ఉద్దేశంతో చేపట్టే విధానాల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ముఖ్యంగా వృత్తి విద్యాకోర్సులు, ఉన్నతస్థాయి విద్యాసంస్థల్లో ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. అణగారిన వర్గాల అభ్యర్థులకు అండదండలు అందచేయడం ద్వారా ఈ పని సాధించాలి. ఉదాహరణకు- జనరల్ అభ్యర్థులను చేర్చుకోవడానికి 90శాతాన్ని కటాఫ్ స్కోరుగా తీసుకుంటే, ప్రాధాన్య వర్గాల అభ్యర్థుల విషయంలో దాన్ని 80 శాతానికి లేదా 75 శాతానికి పరిమితం చేయాలి. దానివల్ల ముందకు దూసుకెళ్లేందుకు ఆ అభ్యర్థులకూ ప్రోత్సాహ ప్రోద్బలాలు లభిస్తాయి. ఒకేస్థాయిలో ఉన్నత ప్రమాణాలు సాధించడానికి వీలవుతుంది. ఈ ప్రమాణాలను అందుకొనేందుకు వీలుగా ప్రాధాన్యవర్గాల అభ్యర్థులకు ప్లస్ టూ స్థాయిలో ఉచితంగా, విస్తృతంగా శిక్షణ ఇవ్వాలి. మరికొన్ని చర్యలూ చేపట్టాలి. ఆర్థిక పరిస్థితిని ప్రాధాన్యానికి ప్రాతిపదికగా తీసుకోవాలి. అణగారిన వర్గాల్లో- ప్రధానంగా అల్పాదాయ కుటుంబాలకు, ప్రభుత్వంలో లేదా వృత్తిగతంగా నిర్దిష్టస్థాయికి దిగువన ఉన్నవారికి రిజర్వేషన్లను కల్పించాలి. ఇతర వర్గాల్లో- పేద అభ్యర్థులకు ఉచిత విద్యాసదుపాయం కల్పించాలి. డబ్బు లేదన్న కారణంతో ఏ విద్యార్థికీ ఉన్నతవిద్య దక్కని పరిస్థితి రాకూడదు. ఉపకార వేతనాలు, తక్కువ వడ్డీపై రుణాలను వ్యవస్థీకృతం చేయాలి.

బీసీల రిజర్వేషన్లను హేతుబద్ధం చేయాల్సిన అవసరం ఉంది. పాతికేళ్లనాటి మండల్ కమిషన్ నివేదికే నేటికీ ప్రామాణికం కావడం సరికాదు. ప్రాధాన్యం ఇవ్వాల్సిన వర్గాలను నిర్ధారించడానికి, ప్రత్యేక హక్కుల కల్పన కోసం అత్యంత వెనకబడిన (వృత్తి) వర్గాలను గుర్తించడానికి ఎప్పటికప్పుడు సర్వేలు, పునర్విభజన జరపాల్సిన ఆవశ్యకత ఉంది. నానాటికీ వృద్ధి సాధిస్తున్న విశాల ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా నియంత్రణలు తొలగించి, ఉన్నతవిద్యను విస్తరించాలి. లైసెన్సులు నియంత్రణలకు బదులు గుర్తింపు, విద్యాసంబంధ స్వేచ్ఛ, విలువ, పారదర్శకత కల్పిస్తే అవకాశాలు బాగా విస్తరిస్తాయి. ప్రామాణిక ఉన్నతవిద్యకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా ప్రభుత్వ విద్యాసంస్థల ప్రమాణాలనూ గణనీయంగా మెరుగుపరచాలి.

## నాణ్యమైన విద్య తక్షణావసరం

పాఠశాల విద్య, ఆరోగ్య పరిరక్షణలే పరిపాలన వ్యవస్థకు మూలస్తంభాలు కావాలి. బ్రిటీషు ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రామాణిక విద్యను తన ప్రభుత్వ పరువుప్రతిష్ఠలు, మనుగడకు సంబంధించిన సమస్యగా తీసుకొన్నారు. టెక్సాస్ గవర్నర్‌గా పాఠశాల విద్యకు మెరుగులు దిద్దినందువల్లే జార్జి బుష్ 2000లో జరిగిన ఎన్నికల్లో అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మనదేశంలో ప్రభుత్వ విధానాలు, రాజకీయ కార్యకలాపాలు, పరిపాలన వ్యవస్థలో విద్యకు ప్రాధాన్యమే లేదు. రిజర్వేషన్ల సమస్య తలెత్తినప్పుడు మాత్రమే రాజకీయ నాయకులు, సమాచార మాధ్యమాల దృష్టి విద్యారంగంపై పడుతుంది. అనేకమందికి అన్యాయం జరుగుతుందంటే అందుకు మూలకారణం- సామాజికరంగాన్ని చక్కదిద్దటంలో ప్రభుత్వ వైఫల్యమే. కొంతమందికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చే బదులు అందరికీ నాణ్యమైన పాఠశాల విద్య అందచేయడం మంచిదన్న ఆలోచనా ఉంది. ఈ విషయంలో ప్రభుత్వ ఘోరవైఫల్యానికి పేదలను, అణగారిన వర్గాలను బాధ్యులను చేయలేమని అందరం గుర్తించాలి. ఇన్నాళ్లూ తీవ్ర నిర్లక్ష్యానికి గురైన వర్గాలవారు నాణ్యమైన విద్య కోసం, సదవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద దళితులు సైతం నెలకు రూ.200 చెల్లించి పిల్లాణ్ని కాన్వెంట్ చదువు చదివిస్తున్నారు. ఇన్నాళ్లూ నిర్లక్ష్యానికి గురైనవారికి ప్రాధాన్యం ఇవ్వడానికి తగిన విధానాలను రూపొందించాలి. అదే సమయంలో నాణ్యమైన విద్యనూ అందచేయాలి. ఇప్పుడు దేశానికి కావలసింది ఇదే. సమానతను, సామర్థ్యాన్ని జతపరిచే కార్యక్రమాలను రూపొందించాలి.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా ఏప్రిల్ 24, 2006న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం) ❍

# జీహెచ్‌ఎంసీ సాంప్రదాయ రాజకీయ రేసులో గెలుపు గుర్రం తెరాస, మట్టికరచిన కాంగ్రెస్, తెదేపా, బీజేపీ

సాంప్రదాయ రాజకీయ పార్టీల మధ్య గుర్రప్పందాల్లా జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితి గెలుపు గుర్రమైంది. తెరాస ధాటికి మిగిలిన సా.రా పార్టీలు కాంగ్రెస్, తెలుగుదేశం, బీజేపీలు మట్టికరిచాయి. ఫిబ్రవరి 5న వెలువడిన జీహెచ్‌ఎంసీ 150 వార్డుల ఫలితాలలో తెరాసకు 99 సీట్లు రాగా, మజ్లిస్‌కు 44, బీజేపీకి 4, కాంగ్రెస్‌కు 2, తెదేపాకి 1 సీట్లు వచ్చాయి. ఆ సాంప్రదాయ రాజకీయానికి ప్రత్యామ్నాయంగా వచ్చిన లోక్‌సత్తా, సీపీఎం, సీపీఐ, ఎంసీపీఐ, ఎంబీసీ జేఏసీ 'వన్ హైదరాబాద్' కూటమికి ఒక్క సీటు కూడా రాలేదు.

లోక్‌సత్తా, మిత్రపక్షాల ఎజెండా, స్వచ్ఛ రాజకీయం బాగున్నాయి, కానీ ఈసారి కూడా మేం సాంప్రదాయ రాజకీయ పార్టీల మధ్యే ఎంచుకో దలుచుకున్నాం అని ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా చెప్పారు. ఒక స్థానిక ఎన్నికకు ఉండాల్సిన నిజమైన ఎజెండాతో ఈ ఎన్నికలలో పోటీ చేసిన వన్ హైదరాబాద్.. ఆ ఎజెండా ప్రచారంలో చెప్పుకోదగిన విజయమే సాధించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో స్థానిక ప్రభుత్వం సమానమైనదేనని, చెప్పాలంటే ప్రజల రోజువారీ జీవితంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కన్నా స్థానిక ప్రభుత్వమే ముఖ్యమైనదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లటానికి లోక్‌సత్తా, మిత్రపక్షాలు శాయశక్తులా కృషి చేశాయి. కానీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెరాసకు ఇంకా మూడేళ్ల పాలన ఉండటం, యధేచ్ఛగా డబ్బు, ప్రలోభాల పంపిణీ, అధికార దుర్వినియోగంతో తెరాస చేసిన అతి భారీ ప్రచారం, కాస్త ఆలోచన, వనరులు ఉన్నవారు ఓటింగ్‌కు దూరంగా ఉండటం వంటి కారణాలతో వన్ హైదరాబాద్ ఎజెండాకు తగ్గ ఓట్లు పడలేదు.

నిజానికి ఈ ఎన్నికల్లో పొత్తుకి తెరాస, తెదేపా-భాజపా కూటమి నుంచి కూడా సానుకూల సంకేతాలున్నా, సరైన ఎజెండా ప్రాతిపదికన పొత్తు ఉండే అవకాశాలు లేకపోవటంతో లోక్‌సత్తా వెనక్కి తగ్గింది. తెరాసతో పొత్తు వల్ల ఓట్లు-సీట్లు వచ్చేవేమోగానీ, ఆ పార్టీ కేంద్రీకృత రాజకీయాన్ని, ఫిరాయింపుల సంస్కృతి దీర్ఘకాలంలో లోక్‌సత్తాకు కొత్త సమస్యల్ని తెచ్చే ప్రమాదముంది. ఇక 2014 ఎన్నికల్లో సీట్లు అమ్ముకుని, మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్‌కి ప్రచారం చేయకుండా పవన్ కళ్యాణ్‌ను సైతం అడ్డుకుని తెలుగు రాష్ట్రాలకు, ఈ దేశ ప్రయోజనాలకు తీవ్ర నష్టం చేసి ఇంకా పాతబాటలోనే సాగుతున్న తెదేపాతో పొత్తు అర్థరహితం. అందుకే

## జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 72 మంది నేరచరితులు

గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 72 మంది నేరచరితులు కార్పొరేటర్లుగా పోటీ చేసినట్టు సుపరిపాలన వేదిక కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి తెలిపారు. "గ్రేటర్ పరిధిలో 150 డివిజన్లుంటే.. అందులో 51 డివిజన్లలో వివిధ కేసులు నమోదైన అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో పురుష అభ్యర్థులు 64 మంది, మహిళలు 8 మంది ఉన్నారు. పరిపాలనలో మార్పు రావాలని, ఎన్నికల్లో ప్రజలకు మేలు చేసే నాయకులు గెలవాలన్న ఉద్దేశంతో మేం తెలుగు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల ప్రక్రియల్ని విశ్లేషిస్తున్నాం. పోటీ చేసే అభ్యర్థుల ప్రమాణ పత్రాల్లో వివరాల ఆధారంగా, పోలీసు ఠాణాల్లో నమోదైన కేసులు, విచారణలో ఉన్నాయన్న వివరాల ఆధారంగా ఆయా ఠాణాలకు లేఖలు రాసి తెప్పించుకున్న సమాచారం ఆధారంగా ఈ జాబితాను రూపొందించాం. ఎన్నికల్లో నేరచరితులకు టికెట్టివ్వద్దు అని రెండుసార్లు ప్రధాన రాజకీయ పార్టీలకు లేఖలు రాశాం. మా అభ్యర్థనను మన్నించకుండా ఆయా రాజకీయ పక్షాలు నేరచరిత్ర ఉన్నవారిని అభ్యర్థులుగా నిలబెట్టాయి. తెరాస-14, తెలుగుదేశం-13, కాంగ్రెస్-13, బీజేపీ-4, మజ్లిస్-11, ఎంబీటీ-2, ఇతర పార్టీలు-4, స్వతంత్రులు-11 మంది నేరచరితులు ఉన్నారు. 2009లో జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో మాజీ మేయర్ మాజిద్ హుస్సేన్ తనపై 6 కేసులున్నట్టు ప్రమాణపత్రంలో పేర్కొనగా, తాజా ఎన్నికల్లో రెండే ఉన్నాయంటూ తెలిపారు. ఆయా కేసులు విచారణలో ఉన్నట్టు పోలీసుల ద్వారా మాకు తెలిసింది" అని పద్మనాభరెడ్డి వివరించారు. అభ్యర్థులు నచ్చకపోతే తిరస్కరించే హక్కును కల్పిస్తున్న 'నోటా'ను జీహెచ్‌ఎంసీ ఎన్నికల ఈవీఎంలో తొలగించటాన్ని సుపరిపాలన వేదిక ఉపాధ్యక్షుడు డాక్టర్ రావు చెలికాని ప్రశ్నించారు. శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో నోటా ఉండాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, స్థానిక ఎన్నికలకు వర్తించబోదంటూ అధికారులు సమాధానం ఇవ్వటాన్ని ఆయన ఆక్షేపించారు.

## ఓటుకు రూ.300 నుంచి 2000

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రలోభాలకు వందల కోట్లు ప్రవహించాయి. ప్రచారం, డబ్బు పంపిణీ, ప్రలోభాలకు కలిపి ఒక్కో ప్రధాన సాంప్రదాయ పార్టీ అభ్యర్థి రూ. 1కోటి వరకూ ఖర్చు చేసినట్టు సమాచారం. ఓటుకు రూ. 300 నుంచి 2000 వరకు పంపిణీ చేశారు. సూట్‌కేసులతో మాజీ మేయర్ సహా పలువురు పెద్దలు ప్రత్యక్షంగా రంగంలోకి దిగి నిర్భయంగా డబ్బు పంపిణీ చేస్తున్నా పలుచోట్ల పోలీసులు అబ్బే, మేం ఏమీ చూడలేదు అన్నట్టు వ్యవహరించారు. ఒక పార్టీకి సంబంధించిన సమాచారాన్ని మరోపార్టీకి దళారుల్లా చేరవేయటం, ఇద్దరికీ మార్గదర్శకాలు అందించటం వంటివి కొన్ని చోట్ల పోలీసులే చేసినట్టు వార్తలచ్చాయి. చదువుకున్నవాళ్లు, జీవనోపాధికి లోటు లేని వాళ్లు ఉన్న డివిజన్లలో కూడా పంపిణీ జరిగింది. ఓటరు స్లిప్పుల పంపిణీలో ఈసారి పార్టీలకు పాత్ర లేకపోయినా కొన్నిచోట్ల ఆ ముసుగులో డబ్బు పంపిణీ చేస్తుంటే ప్రతిపక్షాలు పట్టిచ్చినా ఫ్లయింగ్ స్క్వాడ్ వదిలేశారు. అధికార పార్టీకి ప్రభుత్వ యంత్రాంగం యధాశక్తి సహకరించిందనే ఆరోపణలకు బలం చేకూర్చే ఘటనలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. సగం డివిజన్లలో మహిళలే అభ్యర్థులు కావటంతో ఈసారి మహిళల్ని ఆకట్టుకోవటంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. బొట్టు భరిణెలు, చీరలతోపాటు ఓ 500నోటుని కొన్ని ప్రాంతాల్లో పంపిణీ చేశారు. వేలంపాటలాగా ప్రత్యర్థి ఓటుకు రేటు పెంచేయటంతో రాత్రికి రాత్రి రూ. 10లక్షల కాల్‌మనీ తీసుకున్నానని ఓ అభ్యర్థి వాపోయాడు. కొన్ని బస్తీ, కాలనీ సంఘాలు రూ. 3 లక్షల నుంచి గంపగుత్త ఓట్లకు డీల్ మాట్లాడుకున్నాయి. డబ్బు, తాయిలాలు తీసుకోవటం ఇష్టంలేని వారిలో కొంతమంది కులం, అవినీతి ప్రభావాలకు లోనై ఓటు విషయంలో రాజీపడ్డారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు చేయాల్సిన పనులు లంచాలు, వేధింపులు లేకుండా జరగట్లేదు కాబట్టి కార్పొరేటర్ అభ్యర్థుల చేతే కొన్ని హామీలు తీసుకుని అపార్ట్‌మెంట్లవాసులు, కాలనీ నివాసితులు ఓట్ల బేరం కుదుర్చుకుంటున్నారు. అంబర్‌పేటలోని ఓ బస్తీలో కౌంటర్ ఏర్పాటు చేసి మరీ మద్యం సరఫరా చేశారు. ఓటు వేయటానికి డబ్బు ఇస్తే వృధా అవుతుందేమోనన్న భయంతో ఆధార్ కార్డు జిరాక్స్ కూడా తీసుకుంటూ జాగ్రత్తపడ్డారు. రెక్కాడితేగానీ డొక్కాడని సామాన్యులను పక్కనబెడితే, కాస్త ఆదాయం, ఆలోచన ఉన్నవారు కూడా వ్యవస్థ మీద, రాజకీయాల మీద, మార్పు తేవటంలో తమ సామర్థ్యం మీద తమకే నమ్మకం లేక ప్రత్యక్షంగా, పరోక్షంగా లొంగిపోవటం కనిపించింది.

గెలుపు కష్టమైనా, ఎన్ని అవరోధాలొచ్చినా భావసారూప్యమున్న వామపక్షాలతో కలిసి లోక్‌సత్తా జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీచేసింది. అధికారంలోకి వచ్చే అవకాశం లేకపోతే తెదేపా, కాంగ్రెస్‌లాంటి సాంప్రదాయ పార్టీల పరిస్థితి ఎంత దయనీయంగా తయారవుతుందో ఈ ఎన్నికలు మరోసారి నిరూపించాయి. దశాబ్దాల చరిత్ర ఉన్న తెదేపా, శతాబ్దానికి పైగా చరిత్ర ఉన్న కాంగ్రెస్‌కసీట్లు గెలవటం సంగతి అలా ఉంచితే కనీసం డబ్బులివ్వకుండా జెండా పట్టే నాయకులే కరవయ్యారు. ఆ పార్టీల ఉనికి అనవసరమనే పరిస్థితి క్షేత్రస్థాయిలో తయారైంది. సంస్థాగతంగా ఎంత బలహీనంగా ఉన్నా లోక్‌సత్తా పార్టీ తన ఎజెండా, రాజకీయ సంస్కృతితో ఈ పార్టీ అవసరముంది అనే స్థాయిలోనే ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగింది.




ఈ జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తెరాసకు లభించిన విజయం సానుకూల ఓటుతో అనటంలో సందేహం లేదు. తెలంగాణలోని ఇతర ప్రాంతాలలో నెగ్గిన సీట్లతో 2014లో అధికారంలోకి వచ్చిన తెరాసకు రాజధాని హైదరాబాద్‌లో ఆదరణ లేకపోవటం పెద్దలోటుగానే ఉంది. హైదరాబాద్‌లో పట్టు నిలుపుకుంటేనే నైతికంగా కూడా బలోపేతం కాగలమని ఆ పార్టీ గుర్తించింది. అది వాస్తవం కూడా. దానికితోడు తెరాసను ఒక పార్టీగా, కేసీఆర్‌ను, ఆయన అనుచరులను నాయకులుగా గుర్తించనివారు హైదరాబాద్‌లో పెద్దసంఖ్యలోనే ఉన్నారు. అది కూడా కేసీఆర్‌కు చాలా వెలితిగా మారింది. ఆత్మన్యూనతలా మారిన ఆ లోటును అధిగమించాలంటే హైదరాబాద్‌లో గెలుపు ముఖ్యమని తెరాస భావించింది. అందుకే రాష్ట్ర ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో ఉండే సాధారణ అనుకూలతకు తోడు ఆధునికత మేళవించిన తన కుమారుడు కె. తారకరామారావుని ప్రయోగించి అన్ని ప్రాంతాలవారినీ ఒప్పించి అక్కున చేర్చుకునేందుకు చర్యల్ని కేసీఆర్ ప్రారంభించారు. ఇది సమన్వయంతో పరిష్కరించే సామరస్య ప్రయత్నం చాలా ఆహ్వానించదగ్గ పరిణామం. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే సంస్కృతి. 24గంటల విద్యుత్తు వంటి అంశాలను కేటీఆర్ చాలా సమర్థవంతంగా ఈ ప్రచారంలో వినియోగించుకున్నారు.

## ఓట్లు ఏ పార్టీ గుత్త సొత్తు కాదు

మా ఓట్లను లోక్‌సత్తా పార్టీ చీల్చబట్టే ఓడిపోయాం అని కొన్ని పార్టీలు దుష్ప్రచారం చేయడం, లోక్‌సత్తా చిన్న పార్టీ కాబట్టి ఓటు వేయడం వేస్టు అని ఎక్కువశాతం ప్రజలు భ్రమపడటం లోక్‌సత్తాకు ప్రతి ఎన్నికల్లో సమస్యగానే ఉంటోంది. "ఓట్లు ఎవరి సొత్తూ కాదు, ప్రజలు ఎప్పటికప్పుడు తమకు నచ్చిన అత్యుత్తమ పార్టీకే ఓటు వేయటం న్యాయం. లోక్‌సత్తా కంటే మెరుగైన ఎజెండా, అభ్యర్థులతో వస్తే ఆ పార్టీకే ఓటు వేయండి. అలాగే చిన్న పార్టీలు, పెద్ద పార్టీలు ఉండవు, ప్రజలు ఓటు వేస్తే అదే పెద్ద పార్టీ అవుతుంది, ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్)కి ప్రజలు ఓట్లు వేశారు కాబట్టి అధికారంలోకి రాగలిగింది" అని లోక్‌సత్తా పదేపదే వివరిస్తుండేది. ఈ వాదనలు ఎంత వాస్తవమో జీహెచ్‌ఎంసీ తాజా ఎన్నికల్లో మరోమారు రుజువయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో ఒకప్పుడు జీరోగా ఉన్న తెరాస ఇప్పుడు హీరో అయింది. 21 నెలల క్రితం ఇతర పార్టీలకు ఓటు వేసిన ప్రజలు ఇప్పుడు తెరాసకు ఓటు వేయటం వల్లే అది సాధ్యమైంది. ప్రజలు తల్చుకుంటే రాత్రికి రాత్రి ఏ పార్టీ అయినా పెద్ద పార్టీ అయిపోతుందంతే.

2014 ఎన్నికల సమయంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 అసెంబ్లీ స్థానాలుంటే, తెదేపా 9, భాజపా 5 గెలుచుకున్నాయి. ఈ 14 స్థానాల్లో ఇప్పుడు ఆ పార్టీల ఆధిపత్యానికి భారీ గండి పడింది. 2014లో తెదేపా-భాజపా కూటమికి 14.66 లక్షల (34.42శాతం) ఓట్లు వస్తే, ఈ ఎన్నికల్లో 7.85 లక్షల (23.46శాతం) ఓట్లు మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి గత అసెంబ్లీ ఎన్నికల్లో 6.19 లక్షల (14.55శాతం) ఓట్లు సాధిస్తే, జీహెచ్‌ఎంసీ ఎన్నికలు వచ్చేసరికి 3.48 లక్షలు (10.4శాతం)కి పరిమితమైపోయింది. ఎంఐఎం కూడా ఓట్లను కోల్పోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో 11.42 లక్షల (26.64శాతం) ఓట్లను సాధించిన ఎంఐఎం ఈ ఎన్నికల్లో 5.30 లక్షల (15.85శాతం) ఓట్లను మాత్రమే పొందగలిగింది. అయినా కూడా ఈ పార్టీ బల్దియాలో 44 డివిజన్లను సొంతం చేసుకుంది. తెరాస అధికంగా ఓట్లను సాధించటం ద్వారా నగరంలో మొట్టమొదటిసారి భారీ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 7.82లక్షల లక్షల (18.36శాతం) ఓట్లను సాధించిన తెరాస బల్దియా ఎన్నికల్లో 14.68 లక్షల (43.85శాతం) ఓట్లను సాధించింది. ఈ పార్టీకి అదనంగా 25.49శాతం ఓట్ల లభించాయి.




దీనికితోడు తెలుగుదేశం అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కుమారుడు లోకేష్‌ను పార్టీలో ప్రమోట్ చేసుకునే క్రమంలో అభద్రతకు లోనై ఆడిన నాటకాలు ఓటుకు కోట్లు కేసుతో వికృతరూపంలో బైటపడటం ఓటర్లకు మింగుడుపడలేదు. సాంప్రదాయ నేతలనే ఎన్నుకోవాలనుకున్నప్పుడు మనకమధ్యే ఉండేవాళ్లని ఎన్నుకోవటం మేలని ఎక్కువమంది ఓటర్లు భావించారు. నగరంలో అవినీతికి, కబ్జాలకు పాల్పడటంతోపాటు తెలంగాణ విషయంలో ఓట్లు, సీట్లు లెక్కలేసుకుని ప్రజల మధ్య చిచ్చుపెట్టటంలో భాగస్వాములైన కాంగ్రెస్ నేతలను ప్రజలు క్షమించలేకపోయారు. బీజేపీని కూడా తెదేపా, కాంగ్రెస్‌కు కొనసాగింపుగానే చూశారు. ఒక్కసారి తెరాసకు అవకాశమివ్వటంలో తప్పులేదని భావించారు.

ఇక బస్తీల్లోని వారిలోనైతే చాలామందికి కేసీఆర్ ఇంకా ప్రత్యేక తెలంగాణ తెచ్చిన గొప్ప నాయకుడే. తెలంగాణ జిల్లాల నుంచి హైదరాబాద్‌కి వచ్చిన ముస్లింలలో కూడా అదే భావన ఉంది. డబుల్ బెడ్‌రూం ఇళ్లు వంటి హామీలు వారి మీద బాగా ప్రభావం చూపాయి.

చంద్రబాబు ఇక్కడ చేసిన ఎన్నికల ప్రచారం కూడా ఆ వాతావరణాన్ని బలోపేతం చేసేలాగానే సాగింది. నిజానికి ఇక్కడ తెలుగుదేశాన్ని బలోపేతం చేయటం వల్ల ఏ రేవంత్ రెడ్డికో, ఎర్రబెల్లి దయాకర్‌రావుకో లాభం వచ్చేలా ఉందని, అందువల్ల తెలంగాణ నీది, ఆంధ్రప్రదేశ్ నాది అని కేసీఆర్‌తో ఇటీవల విజయవాడలో చంద్రబాబు ఒప్పందానికి వచ్చారని కొందరి గుసగుసలు. డీల్‌లో ఓటుకు కోట్లు కేసును నీరుగార్చటం ఒకటి. అంటే, మళ్లీ ప్రజలకే నష్టమన్నమాట. ఇక లోకేష్ ప్రచారం బాగుందన్న మాట తెదేపా బాకాల్లోనే తప్ప ఎవరి నోటా రాలేదు. పార్టీకన్నా, ప్రజలకన్నా తమ కుటుంబం, హైదరాబాద్‌లో తమ వ్యాపార ప్రయోజనాలే ముఖ్యమన్నట్టు ఆ ప్రచారం సాగింది.

ఇలా ఏరకంగా చూసినా మిగిలిన ప్రధాన పార్టీల నేతల

కంటే కేసీఆర్ బెటర్ అనే సానుకూల వాతావరణంలో గ్రేటర్ ఎన్నికలు జరిగాయి. కొన్ని చదువుకున్న కాలనీ, అపార్ట్‌మెంట్‌వాసులు చాలామంది దూరంగా ఉండటంతో ఫలితాలు ఊహించినదానికంటే ఎక్కువ తెరాసకవైపు మొగ్గాయి. స్థానిక ఎన్నికల పట్ల ఇంకా చిన్నచూపు, తెదేపాకసహా ఏ సాంప్రదాయ పార్టీకి ఓటు వేసినా తెరాసకు వేసినట్టే అనే భావన వల్ల వారు ఓటుకు ముందుకు రాలేదు. తెరాసను ఒక రాష్ట్రంలో ఉన్న అధికార పార్టీగా, కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా అంగీకరించటానికి ఇంకా సిద్ధపడని భూస్వామ్య ఆలోచనాపరులు కూడా వీరిలో ఉన్నారు. బల్దియాలో గెలుపుతో సంపూర్ణ తెలంగాణ వచ్చినట్టని భావించిన మేధావివర్గాలు కూడా అన్నిరకాలుగా కేసీఆర్ గెలుపుని కోరుకుని ప్రచారంలో సహకరించాయి.

అయితే చాలామంది ఇంతవరకే చర్చిస్తున్నారుగానీ, ఎన్నికల్లో గెలుపు కోసం తెరాస చేసిన ప్రచారానికి చేసిన ఖర్చు, అధికార దుర్వినియోగం, ఓట్ల కోసం పంచిన డబ్బు వీటి గురించి ప్రస్తావన చేయటం లేదు. అవన్నీ మామూలే అన్నట్టు మాట్లాడుతున్నారు. నిజంగా అంత బలమే ఉంటే, ఇన్ని వందల కోట్లు తెరాస ఎందుకు ఎన్నికల కోసం ఖర్చు చేసింది? డబ్బు, ప్రలోభాలు, విపరీత ప్రచారం, వంశపారంపర్య రాజకీయాలు, ఫిరాయింపులు, అధికార కేంద్రీకరణ, భూస్వామ్య పందేరాలు వంటి లక్షణాలలో ఇతర సాంప్రదాయ రాజకీయ పార్టీలతో జరిగిన పోటీలో మాత్రమే తెరాస ఈ ఎన్నికల్లో నెగ్గింది. కండువాలు, జెండాలు తప్ప ఆ పార్టీల ఎజెండా, నేతలు ఒకటే. తెలుగువాడైన గుజ్జుల రవీంద్ర జర్మనీలో మేయర్‌గా గెలవటానికి రూ.80 వేలు ఖర్చు చేస్తే, ఈ జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల ఖర్చు, అధికార దుర్వినియోగం వ్యయం దాదాపు రూ.1000 కోట్లు అంటున్నారు. మేయర్‌కి, కార్పొరేటర్‌కి, మంత్రులకి, ముఖ్యమంత్రికి తేడా లేకుండా కేసీఆర్, చంద్రబాబు, ఇతర మంత్రులు ప్రచారం చేశారు, హామీలిచ్చారు. ఎన్నికల్లో గెలిచిన తెరాస అభ్యర్థులు తాత్కాలికంగా విజయోత్సాహంతో ఉండొచ్చు కానీ వారు తాము ఖర్చు చేసిన కోట్ల రూపాయలను ఎక్కడనుంచి తిరిగి సంపాదిస్తారు? ఒక కార్పొరేటర్‌కి ఐదేళ్లలో వచ్చేది కేవలం రూ. 7లక్షల పైచిలుకు. కానీ ప్రధాన సాంప్రదాయ పార్టీ అభ్యర్థి ఖర్చు చేసింది సగటున రూ.1 కోటి. ఓడిపోయిన తెదేపా, బీజేపీ, కాంగ్రెస్‌వారిలో అప్పులు చేసి లక్షలు వెదజల్లినవారి పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. అధికారం పట్ల పిచ్చి ఇంతకు బరితెగించేలా చేస్తోంది.

అలాగే ప్రజలు సాంప్రదాయ రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా ఉన్న వేదికను వినియోగించుకోవాలనుకోలేదని కూడా ఇక్కడ అంగీకరించకతప్పదు. తెరాస, తెదేపా, బీజేపీ, కాంగ్రెస్‌ల రాజకీయానికి పత్యామ్నాయంగా స్థానిక ప్రజలకే అధికారం, అవినీతి నిర్మూలనకు సర్వీస్ గ్యారంటీ చట్టం, ఫిర్యాదును పరిష్కరించేంతవరకూ బాధ్యత తీసుకునే ఒకే కాల్ సెంటర్ వంటి కీలక ఎజెండాతో, స్వచ్ఛ రాజకీయాలతో వచ్చిన లోక్‌సత్తా, మిత్రపక్షాలకు ఓట్లు వేద్దామని మాత్రం ఎక్కువమంది ప్రజలు అనుకోలేదు. ఓటింగ్‌కు దూరంగా ఉన్న ఆలోచనాపరులు, మధ్యతరగతి వారు కూడా పరోక్షంగా చెప్పిందిదే. "జయప్రకాష్ నారాయణ్ వల్ల 2009లో తెలుగుదేశం పార్టీ ఓడిపోయింది, చంద్రబాబులాంటివాడే మాట్లాడకుండా ఉంటే, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అవసరం, అనివార్యం అని జేపీ అసెంబ్లీలో చెప్తాడా? అందుకే కూకట్‌పల్లిలో ఎమ్మెల్యేగా జేపీ బాగానే పనులు చేసినా, అవినీతి లేకపోయినా 2014లో లోక్‌సత్తాకు వ్యతిరేకంగా ఓటు వేశాం' అని చెప్పినవాళ్లు ఈసారి కూడా ఆ కులపిచ్చితోనే ఓట్లు వేశారు. తాము ఎన్నుకున్న తెదేపా ఎమ్మెల్యే తెరాసలోకి ఫిరాయించినా అంతకంటే తమకు కులమే ఎక్కువన్నట్టు తమకు తామే చెరుపు చేసుకునేలా ఓటు వేశారు. ఓటర్లు సాంప్రదాయ రాజకీయ పార్టీల మధ్య నిలువునా చీలిపోవటంతోపాటు, ప్రజాసమస్యలపై ఎంతో బాగా పనిచేసిన లోక్‌సత్తా అభ్యర్థులకు సైతం డిపాజిట్లు రాకపోవటానికి కొన్నిచోట్ల ఈ ధోరణి కూడా పనిచేసింది.

సాంప్రదాయ రాజకీయం మధ్యే అయినా తెరాస సాధించిన ఘనవిజయాన్ని లోక్‌సత్తా మనస్ఫూర్తిగా అభినందిస్తుంది. తెరాస అన్ని వర్గాల ప్రజలనీ కలుపుకునే ప్రయత్నం చేయటం, ఏ పార్టీకీ ఓటు బ్యాంకులుండవు అని చాటిచెబుతూ ప్రజలు ఓట్లు వేయటం ఈ జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మంచి పరిణామాలు. తెరాస తాను ఇచ్చిన హామీల్ని నెరవేర్చాలని, స్థానిక స్వయంపాలనను బలోపేతం చేయటానికి కృషి చేయాలని లోక్‌సత్తా కోరుతోంది. ఈ దిశగా నిర్మాణాత్మక సహకారాన్ని అందించటానికి లోక్‌సత్తా ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. అలాగే ఓటర్ల జాబితాలో కూడికలు తీసివేతలు దగ్గర్నుంచి ఎన్నికల నిర్వహణ దాకా రాష్ట్ర ఎన్నికల సంఘం పనితీరు పట్ల వచ్చిన సహేతుక విమర్శల్ని చర్చించి తగిన సంస్కరణల్ని చేపట్టటం చాలా అవసరం. ఈదేశంలో కొత్త రాజకీయానికి నాంది పలికిన ఉద్యమంగా, పార్టీగా తన లక్ష్యాలను సాధించే క్రమంలో అధికారాన్ని ఒక సాధనంగా అందుకునేందుకు కూడా ఈ ఎన్నికల అనుభవాలను లోతుగా విశ్లేషించుకుని అవసరమైన దిద్దుబాట్లను లోక్‌సత్తా చేసుకుంటుంది. ○


# హైదరాబాదీలను గెలిపించే స్థానిక స్వయంపాలన ఎజెండాతో పోటీచేసింది 'వన్ హైదరాబాద్' కూటమి మాత్రమే

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఫిబ్రవరి 2న జరిగిన మొట్టమొదటి గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ప్రధానంగా రెండు భావజాల కూటముల మధ్యే జరిగాయి. టీఆర్ఎస్–ఎంఐఎం, టీడీపీ–బీజేపీ, కాంగ్రెస్ తదితర పార్టీల కేంద్రీకృత–అవినీతి రాజకీయం ఒక పక్కనుండగా.. లోక్‌సత్తా, సీపీఎం, సీపీఐ, ఎంసీపీఐ, ఎంబీసీ జేఏసీల స్థానిక పాలన–స్వచ్ఛ రాజకీయాలక'వన్ హైదరాబాద్' కూటమి మరో పక్కన నిలిచింది. ఈ స్థానిక ఎన్నికల్లో స్థానిక ప్రభుత్వ పాలన ఎజెండాతో పోటీచేసింది ఒక్క 'వన్ హైదరాబాద్' మాత్రమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సమానంగా పంచాయితీలలో, మునిసిపాలిటీలలో స్థానిక ప్రభుత్వాలు ఉండాలని తొలి నుంచి పోరాటం చేస్తున్న లోక్‌సత్తా పార్టీ, ప్రజాసమస్యలపై క్షేత్రస్థాయిలో నిరంతరం పోరాడుతుండే భావసారూప్య వామపక్షాలతో కలిసి స్థానిక ఎజెండాతోనే ఈ ఎన్నికలలో బరిలోకి దిగింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితి సహా ఏ ఇతర పార్టీలూ స్థానిక ప్రభుత్వం, వార్డు ప్రభుత్వం అనే ఆలోచనే చేయలేదు.

ఈ ఎన్నికలు కేంద్రానికో, రాష్ట్ర ప్రభుత్వానికో సంబంధించినవి కావు. కానీ మేం లేకపోతే హైదరాబాద్ అభివృద్ధి కష్టమన్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ తదితర మంత్రులు మాట్లాడారు. స్వచ్ఛ హైదరాబాద్‌లో భాగంగా కేసీఆర్ స్వయంగా పార్సిగుట్ట ప్రాంతాన్ని దత్తత తీసుకున్నా, మంత్రులు వేర్వేరు ప్రాంతాలను దత్తత తీసుకున్నా అక్కడి సమస్యలు యధాతథంగా ఉన్నాయి. మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తే కేసీఆరో, మంత్రులో వచ్చి అక్కడ చర్యలు తీసుకోలేదు. స్థానికంగా జరగాల్సిన పారిశుద్ధ్యం, తాగునీరు, మురుగుపారుదల, వీధిదీపాలు, రోడ్లు వంటివన్నీ స్థానిక పాలనతోనే జరగాలి. అంటే వార్డు స్థాయిలో సరైన వ్యవస్థ ఉంటేనే ఇవన్నీ సాధ్యమవుతాయి.

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తెరాస ప్రభుత్వం ఇస్తున్న హామీలన్నీ వారిక్కడ గెలవకపోయినా ఓ రాష్ట్ర ప్రభుత్వంగా చేయాల్సినవి, చేయగలిగినవి. రాష్ట్ర ప్రభుత్వ పనులను, జీహెచ్ఎంసీ పనులను కలగాపులగం చేసి ప్రజలను గందరగోళపరిచి స్థానిక ఎన్నికల్లో ఆధిపత్యం కోసం తెరాస ప్రయత్నించింది. రోజంతా విద్యుత్తు, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవన్నీ చేయటానికి వారేం హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికల్లో గెలవనక్కర్లా. హైదరాబాద్ నుంచి వచ్చే ఆదాయమెంత? హైదరాబాద్ కోసం ఎంత ఖర్చు చేశారు? ఈ 19 నెలల పాలన లెక్కలు తీస్తే వాస్తవాలు నిగ్గుతేలతాయి. రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతలు, జీహెచ్ఎంసీ పాలన వేర్వేరు అని స్పష్టంగా అర్థమవుతుంది. జీహెచ్ఎంసీకి కావలసింది అవినీతి లేని వార్డు స్థాయి పాలన. ఆ ఎజెండా ఎక్కడా తెరాస వద్ద లేదు. ఉండి ఉంటే, రాష్ట్ర బడ్జెట్ సమయంలోనే తలసరి కేటాయింపుతో నేరుగా తెలంగాణవ్యాప్తంగా స్థానిక ప్రభుత్వాలకు కేటాయింపు చేసి ఉండేవారు. బడ్జెట్ సమయంలో లోక్‌సత్తా చాలా స్పష్టంగా ఈ డిమాండ్ చేసింది కూడా.

జీహెచ్ఎంసీ వాహనాల కొనుగోలు, మరమ్మతులలో రూ.100కోట్ల స్కాం, ప్లేటు భోజనం రూ.2000తో చేసిన జల్సాలు, ల్యాప్‌టాప్‌లు, హ్యాండీ కెమెరాలు కొనిచ్చినా కొరియర్‌లకు భారీగా ప్రజాధనం చెల్లింపులు, వార్డుల అభివృద్ధికిచ్చిన నిధుల్లో రూ.490 కోట్లు మురిగిపోయేలా చేయటం, గర్భనిరోధక వ్యాక్సిన్ పేరుతో ఒక్కో వీధికుక్కకు రూ.5,000 ఖర్చుచేసినా ఫలితాలు లేకపోవటం ఇలా గత ఐదేళ్లుగా కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల కార్పొరేటర్ల నిర్వాకం వల్ల ఎంత ప్రజాధనం వృధా అయిందో, అవినీతిపాలయిందో లోక్‌సత్తా వరసగా సహ చట్టం ద్వారా బైటపెట్టింది. మళ్లీ ఆ పార్టీల నేతలనే తమ పార్టీలో చేర్చుకుని తెరాస కొత్త పాలన అందిస్తామంటూ మభ్యపెట్టింది. విశ్వనగరం చేస్తామని సీఎం, మంత్రులు అన్నారుగానీ.. ఏ విశ్వనగరంలో ముఖ్యమంత్రి, మంత్రుల పెత్తనం ఉంటుందో చెప్పమనండి? విశ్వనగరంలో వార్డుస్థాయిలో ప్రజల పర్యవేక్షణలో పాలన ఉంటుంది, సాధికారత గల మేయర్ ఉంటాడు. ఏ విశ్వనగరంలోనూ ఇప్పుడు తెరాస చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వమే అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ స్థానిక ఎన్నికల ప్రచారం చేయదు.




గత 19నెలల తెరాస పాలనను, అంతకుముందు వివిధ పార్టీల చరిత్రను చూశాక హైదరాబాద్‌లో అత్యధిక శాతం ప్రజల జీవితాలు బాగుపడాలంటే, రోజువారీ పనులు వార్డు స్థాయిలో

జరిగే ఏర్పాటు ఉంటే తప్ప సాధ్యం కాదు అనేది సుస్పష్టం. 2009 ఎన్నికలలో లోక్‌సత్తా ప్రతి వార్డులోని సమస్యలూ, పరిష్కారాలతో వార్డు మేనిఫెస్టోల్ని విడుదల చేసింది. ఆ సమస్యలు అన్నీ దాదాపు ఇప్పటికీ యధాతథంగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్ వల్ల వచ్చిన ఆదాయం మిగులుతో పందేరాలు చేస్తూ సొంత ప్రచారం చేసుకుంటున్న తెరాస ప్రభుత్వం.. నగరంలో పారిశుద్ధ్యాన్ని బాగు చేసేందుకు ఇంతవరకూ చర్యలు కూడా చేపట్టలేకపోయింది. హైదరాబాద్‌లో మేయర్‌ని డమ్మీలుగా చేసి ముఖ్యమంత్రే పరోక్ష మేయర్‌లా వ్యవహరించే కాంగ్రెస్, టీడీపీల పాత కేంద్రీకృత రాజకీయాన్నే తెరాస ప్రభుత్వం కూడా కొనసాగించాలను కుంటోంది. మేయర్ అధికారాలు, అప్రజాస్వామికంగా పరోక్ష ఎన్నిక చేయటం స్థాయి ప్రశ్నల్ని కూడా లోక్‌సత్తా లేవనెత్తటం లేదు. కనీసం ప్రజలు తమ రోజువారీ సమస్యల్ని తీర్చుకోవటానికి నేరుగా వార్డు స్థాయిలోకి నిధుల్ని ఇవ్వాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో ధ్రువపత్రాలు, తాగునీటి కనెక్షన్లు వంటివి తెచ్చుకోవటం వంటి పనులు సకాలంలో జరగకపోతే ప్రజలకు రోజుకు రూ.250 నష్టపరిహారం ఇచ్చేందుకు సర్వీస్ గ్యారంటీ చట్టం తేవాలని, సమస్యలు తీర్చటానికి సింగిల్ కాల్‌సెంటర్‌ని ఏర్పాటు చేయాలని పోరాడుతోంది.

హైదరాబాద్‌లో ఒక్కొక్క పౌరుని పేరు మీద ఏటా రూ.5,000-7,000 ఖర్చు చేస్తున్నా, స్థానికంగా ఎక్కడి సమస్యలు అక్కడే అన్న చందంగా ఉన్నాయి. నిధుల్లో 70శాతానికిపైగా పైనుంచి ఖర్చు చేస్తుండటమే ఇందుకు కారణం. వార్డు స్థాయిలో వినియోగించాల్సిన నిధుల్ని కూడా ఖర్చుచేయకుండా జల్సాలు చేసుకుంటారు, ఇష్టమొచ్చినవాటికి మళ్లిస్తుంటారు. నేతలకు వ్యక్తిగతంగా పేరు తెచ్చిపెట్టే పథకాలకు నిధుల్ని మళ్లిస్తుంటారు. దీనివల్ల డబ్బు వేలకోట్లలో ఖర్చవుతుంటుంది తప్ప ప్రజల సమస్యలు మాత్రం యధాతథంగా కొనసాగుతుంటాయి. పథకాలకు తప్పనిసరిగా ఖర్చు చేసే నిధులలో కూడా అవినీతి, అసంబద్ధత. డ్రైనేజీ పనులు పూర్తిచేయకుండానే రోడ్లు వేయటం వల్ల అవి వేసిన కొన్ని రోజులలోనే కొట్టుకుపోవటం జరుగుతోంది. దశాబ్దాలుగా సాగుతున్న ఈ తంతు మారాలంటే, వార్డు స్థాయిలో స్థానిక ప్రజలకు నేరుగా నిధులిచ్చేలా లోక్‌సత్తా ప్రతిపాదించిన వార్డు ప్రభుత్వం ఏర్పాటే పరిష్కారం. నిధులు వార్డుల్లోనే ప్రజల భాగస్వామ్యంతోనే ఖర్చవుతుంటే, ఫలితాలు మెరుగవుతాయి, అవినీతి తగ్గుతుంది.

ఇక బరిలో ఉన్న మిగిలిన సాంప్రదాయ పార్టీలను చూస్తే, హైదరాబాద్‌లో స్థానిక పాలనను గాలికి వదిలేసి వీలున్నంత మేర కబ్జాలకు పాల్పడిన కాంగ్రెస్ పార్టీ ఇంకా విధానపరమైన మార్పులతో కాకుండా పాత రాజకీయం, పాత వంశపారంపర్య, దోపిడీ నాయకత్వంతోనే, కేవలం తెరాసను ఓడించటమే లక్ష్యంగా పోటీచేసింది. ఎలాగోలా ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి కాగలిగాను అని సంతృప్తిపడుతున్న తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఇప్పుడు తెలంగాణలో తన పార్టీ అవసరం లేకుండా చేసుకున్నారు. కాంగ్రెస్, తెలుగుదేశంకు ఓటు వేస్తే తెరాసకు వేసినట్టే అనేది సుస్పష్టం కాబట్టి వాటికి వేసిన ఓట్లు వేస్టు అని వేరే చెప్పనక్కర్లా. ఇక ఎంఐఎం, బీజేపీ పోటాపోటీగా మతం పేరుతో ఓట్లు అడిగాయి. కులం, మతం పేరుతో రాజకీయాలు చేస్తే ఎంతటి అనర్థాలు జరుగుతాయో హైదరాబాద్ కేంద్రీయ వర్సిటీలో రోహిత్ వేముల ఆత్మహత్య హెచ్చరిస్తోంది. అందుకే అలాంటి కుల, మత రాజకీయాల్ని ఎన్నికల్లో తిప్పికొట్టాలని వన్ హైదరాబాద్ కూటమి స్పష్టంగా పేర్కొంది.

హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలలో గెలిస్తే కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలని కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలు ఊపందుకుంటాయని అంటున్నారు. వాళ్ల వంశపారంపర్య రాజకీయాల గొడవ తర్వాత చూద్దాం, కానీ మునిసిపల్ ఎన్నికల్లో ఎవరు గెలిస్తే, ఏం చేస్తే హైదరాబాద్ అందరికీ భద్రమైన, సంతోషకరమైన నగరంగా వెలుగొందుతుంది? అన్నవే మనకు కావాల్సింది. అందుకోసం వన్ హైదరాబాద్‌కూటమి "స్థానిక ప్రజలకే అధికారాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవలందించే 'సర్వీస్ గ్యారంటీ చట్టం', మహిళల రక్షణకు కమ్యూనిటీ పోలీసింగ్ సహా నిర్దిష్ట ఏర్పాట్లు, ఒకే టికెట్ వ్యవస్థతో ప్రజారవాణా వ్యవస్థ మెరుగుపరిచి ట్రాఫిక్‌ని, కాలుష్యాన్ని తగ్గించటం, కాంట్రాక్టర్ల నుంచి పర్సంటేజీలు లేకుండా జాతీయ రహదారుల ప్రమాణాలతో నగర రోడ్ల నిర్మాణం, ట్యాంకర్ల మాఫియాను నిర్మూలించి హక్కుగా మంచినీరివ్వటం, రీసైక్లింగ్ విధానాలతో చెత్త నిర్వహణ, ఆరోగ్యకరమైన రీతిలో ప్రజాటాయిలెట్లు, మురికివాడల అభివృద్ధి బోర్డు ఏర్పాటు, అందరికీ అందుబాటులో ఇల్లు, పార్కుల్ని, ఆటస్థలాల్ని కబ్జాల నుంచి విడిపించి గ్రీన్ సిటీగా అభివృద్ధి చేయటం, పాత నగర వారసత్వాన్ని పరిరక్షిస్తూనే ఆధునీకరించటం" అనే 10 అంశాలతో ఉమ్మడి ఎజెండాను రూపొందించుకుని నిజమైన స్థానిక ప్రభుత్వాన్ని అందించేందుకు ప్రజల ముందుకు వచ్చింది. హైదరాబాదీలను గెలిపించే రాజకీయం, ఎజెండా లోక్‌సత్తా, వామపక్షాల కూటమిది అని ధీమాగా, నూరుశాతం నిజాయతీతో చెప్పగలం. మా అభ్యర్థులకే ఓటు వేయాలని డిమాండ్ చేయం, ప్రలోభ పెట్టం. మా స్వచ్ఛ రాజకీయ సంస్కృతిని, ఎజెండాను చూడండి, మిగతా పార్టీలతో బేరీజు వేసుకోండి, నిజాయతీగా సరైనవారికి ఓటు వేయండి అని సాధ్యమైనంత ఎక్కువమందిని అడిగాం. ఎజెండా, రాజకీయ సంస్కృతిపరంగా లోక్‌సత్తా, మిత్రపక్షాలదే పైచేయి అని అన్నివర్గాల ప్రజలతోపాటు ప్రత్యర్థి పార్టీలవారు కూడా పిలిచిమరీ చెప్పిన సందర్భాలు ఈ ఎన్నికల్లో అనేకం. ఇక ఓటు వేయడమనేది ప్రజల బాధ్యత. వారి తీర్పుని గౌరవిస్తున్నాం.

ఔఔ

# పంచాయతీలకు అధికారాలిస్తేనే రాష్ట్రాలకు నిధులిద్దాం, యోచిస్తున్న కేంద్రప్రభుత్వం



రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మేరకు పంచాయతీలకు అధికారాలను బదలాయించాయన్న దానితో 14వ ఆర్థిక సంఘం నిధుల విడుదలను కొంతమేర ముడిపెట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇటీవల ఆర్థిక సంఘం సమావేశంలో దీనిపై చర్చ జరిగిందని సమాచారం.

ఆంధ్రప్రదేశ్ విషయాన్నే తీసుకుంటే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నట్టే పరిశేష ఆంధ్రప్రదేశ్ కూడా గ్రామస్వరాజ్యమనే లక్ష్యానికి చాలా దూరంలో ఉంది. 14వ ఆర్థిక సంఘం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని పంచాయతీ రాజ్ సంస్థలకు ఐదేళ్లలో రూ. 8,654 కోట్లు రావాల్సి ఉంది. ఆర్థిక సంఘం నిధుల సంగతే కాకుండా, పంచాయతీలకు అసలు ఏ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు, అధికారాలు, సిబ్బందిని బదిలీ చేసిందన్నది చూస్తే అంతా డొల్లే. అధికారాలు బదలాయించామంటూ ఉత్తర్వులు ఇచ్చినా కొర్రీల వల్ల అవి నామమాత్రమన్నట్టే తయారయ్యాయి.

**ఇవ్వాల్సింది 29, ఏపీ ఇచ్చింది 10 :** గతంలో ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు ఎలాగైతే అధికారమంతా తన గుప్పెట్లోనే ఉంచుకోవాలన్న ఉద్దేశంతోనే చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరించిందో అలాగే ఇప్పుడు కూడా అధికారాన్నంతా తన గుప్పెట్లోనే కేంద్రీకృతం చేసుకుంది. పంచాయతీ రాజ్ వ్యవస్థలకు 29 అంశాల్లో పూర్తి అధికారాన్ని ఇవ్వాలని 73వ రాజ్యాంగ సవరణ, 1994లో చేసిన ఏపీ పంచాయతీ రాజ్ చట్టం చెబుతున్నాయి. ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం, మంచినీటి సరఫరా, వ్యవసాయంలోని కొన్ని అంశాలు, అంగన్‌వాడీలు, పన్నుల విధింపు, పన్నుల వసూలు తదితరాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ అంశాల్లో పదింటినే బదిలీ చేస్తున్నట్టు ఉత్తర్వులు ఇచ్చారు. అందులోనూ నిజమైన అధికారాలు రాష్ట్ర ప్రభుత్వం గుప్పెట్లోనే ఉన్నాయి.

**11వ స్థానంలో ఏపీ :** పంచాయతీ రాజ్ సంస్థలకు సగం అధికారాలను కూడా బదిలీ చేయని రాష్ట్రాల జాబితాలో ఏపీ ఒకటి. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రం ఎంతమేర అధికారాలు, విధులు, నిధులు, సిబ్బందిని బదిలీ చేశారనే దానిపై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ)తో కేంద్ర ప్రభుత్వం 2013-14లో అధ్యయనం చేయించింది. 21 రాష్ట్రాలను పరిగణలోకి తీసుకుంటే బదలాయింపు సగటు సూచిక ప్రకారం 40.69 శాతంతో ఏపీ 11వ స్థానంలో నిలిచింది. ఈ సూచిక ప్రకారం మహారాష్ట్ర (70.21శాతం), కేరళ (68) కర్ణాటక (65.75శాతం)తో తొలి మూడు స్థానాల్లో నిలిచాయి.

వివిధ విభాగాల సిబ్బంది చేసే పని-ఫలితం అప్పటికప్పుడే బేరీజు వేసుకునేందుకు, అవసరమైతే సరిచేసుకునేందుకు వీలుగా పంచాయతీల స్థాయిలోనే అధికారాలు ఉండాలనే ఉద్దేశంతో సిబ్బందిని బదలాయించాలని చట్టాల్లో పేర్కొన్నారు. ఏపీలోని గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల స్థాయిలో పనిచేసే సిబ్బందిపై పర్యవేక్షణ అధికారాలన్నీ మంత్రిత్వ శాఖలకే ఉన్నాయి. అంతంతమాత్రంగానే ఇవి పంచాయతీ రాజ్ శాఖల పర్యవేక్షణలో కూడా ఉంటాయి. సిబ్బందిపై పర్యవేక్షణకు వాటికి ఉన్నవి సలహాపూర్వక అధికారాలే. ఈ అవకాశం ఒక సాధారణ పౌరుడికి కూడా ఉంటుంది.

పంచాయతీ రాజ్ సంస్థలకు ఉండే అధికారాల్లో చాలావరకు ఒక సాధారణ పౌరునికి కూడా ఉంటాయి. దక్షిణాదిలోని కర్ణాటక, కేరళల్లో మాత్రం కొంత పరిస్థితి మెరుగు. కర్ణాటకలో ఉద్యోగులను మంత్రిత్వశాఖలతో పాటు పంచాయతీలు సమంగా పర్యవేక్షిస్తాయి. కేరళలో పర్యవేక్షణ అధికారాలతోపాటు కొన్ని విభాగాల ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు పంచాయతీలకే అధికారాలు ఉంటాయి.

ఛత్తీస్‌గఢ్‌లో తొమ్మిది విభాగాల్లో ఉద్యోగులను పంచాయతీలే నియమించుకుంటాయి. బీహార్‌లో ఎక్కువ భాగం మంత్రిత్వ శాఖలకే అధికారాలున్నా, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలపై పూర్తి అజమాయిషీ పంచాయతీలదే. గుజరాత్‌లో 14 అంశాలకు సంబంధించిన సిబ్బందిపై పంచాయతీలకు పర్యవేక్షణ అధికారాలు కల్పిస్తూ ఉత్తర్వులిచ్చారు. గోవా, సిక్కింలాంటి చిన్న రాష్ట్రాలలోనూ పంచాయతీ రాజ్ సంస్థల బలోపేతానికి అధికారాలను బదలాయించారు.

# స్థానిక ప్రభుత్వాల ఏర్పాటుకి లోక్‌సత్తా అలుపెరగని కృషి


ఎట్టకేలకు స్థానిక సంస్థలపై కరుణ

Eenadu Nov 7, 2003

ముందుంది అసలు కథ!

అధికారలివ్వగానే సరిపోదు!

కొన్ని శాఖల్లో సాంకేతిక సమస్యలు!

ఎన్నికలే నేపథ్యమా?

గురువారం సచివాలయంలో కేబినెట్ ఉపసంఘంతో 'స్థానిక' సంస్థల నేతల సమావేశంలో పంచాయతీరాజ్ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, హోంమంత్రి దేవేందర్‌గౌడ్, లోక్‌సత్తా కన్వీనర్ జయప్రకాశ్ నారాయణ, తదితరులు.

జాతీయ స్థాయిలో ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వంతో సమానంగా స్థానిక ప్రభుత్వాలుండటం ఏ నాగరిక రాజకీయ దేశంలోనైనా కనిపించే వ్యవస్థ. కానీ దేశ విభజన సమయంలో ఉన్న హింసాత్మక పరిస్థితులను చూసి భయాందోళనలకు గురైన మన జాతీయోద్యమ నేతలు, రాజ్యాంగ నిర్మాతలు కేంద్రీకృత పాలన పట్ల మొగ్గుచూపారు. దీంతో అంతా ప్రధానమంత్రి–ముఖ్యమంత్రి–జిల్లాకలెక్టర్ చుట్టూ తిరిగే ఒక వైఫల్య వ్యవస్థ మనదేశంలో పాతుకుపోయింది. ప్రభుత్వంలో ఏ చిన్న పనికావాలన్నా తలప్రాణం తోకకి వచ్చేలా వ్యవస్థ తయారైంది. కుడిచేయి చేసే పని ఎడమచేయికి తెలియదు. ప్రజాధనం వృధా అవుతుంటుంది కానీ ప్రజలకు కావలసిన పనులు ఏళ్ల తరబడి జరగవు. ప్రజలకు జవాబుదారీ వ్యవస్థ ఉండదు, ఏ రకంగా స్పందించాలో ప్రజలకు తెలియదు. ఈ వ్యవస్థ ఇక బాగుపడదు అని ముక్కుమూసుకుని ఓట్లు వేసే పరిస్థితిని ఈ కేంద్రీకృత పాలన కల్పించింది. అనేక కులాలు, మతాలు, జాతులు, భాషలు ఉండటంతో భారత్‌లో రాజకీయ వ్యవస్థ విఫలమవటం మరిన్ని సంక్లిష్ట సమస్యల్ని సృష్టిస్తోంది. దీనికి విరుగుడుగా ఏకీకృత వ్యవస్థని సంస్కరించి మూడో అంచె ఫెడరలిజంను వ్యవస్థీకృతం చేయాలని లోక్‌సత్తా సుదీర్ఘకాలంగా ప్రయత్నిస్తోంది. పంచాయతీలేకాకుండా మునిసిపాలిటీలు, జిల్లా వరకు ఉండే ఇతర అన్ని స్థానిక సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా పరిగణించాలని లోక్‌సత్తా ఉద్యమ స్థాయిలో చేసిన కృషికి ప్రజల నుంచి మద్దతు లభిస్తోందిగానీ నేతలు, ఉన్నతాధికారులు అడ్డుతగులుతున్నారు. తమ ఆధిపత్యం తగ్గిపోతుందేమోనన్న భయంతో వారు జనం చేతికి అధికారం అందకుండా కొర్రీలు వేస్తున్నారు. పంచాయితీలు, మునిసిపాలిటీలు తదితర స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను, విధులను బదిలీ చేయాలని 2003లో లోక్‌సత్తా చేసిన సంతకాల సేకరణ ఉద్యమంలో దేశ చరిత్రలోనే మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో 1కోటీ 8లక్షలమంది సంతకాలు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక మంత్రిమండలి సమావేశాన్ని నిర్వహించి మరీ ఆ డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. అప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ రాజశేఖర రెడ్డి కూడా తాము అధికారంలోకి వచ్చిన మరుక్షణం అదే ఫైల్ మీద సంతకం పెడతామని భరోసా ఇచ్చారు. అయినా ఇంతవరకూ నెరవేరలేదు. చంద్రబాబు, వైఎస్ నమ్మబలికి మాటతప్పారు.



అయినా లోక్‌సత్తా తన ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంది. పంచాయతీలకు కనీసం రూ.1000, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డు స్థాయికి కనీసం రూ.2000 నేరుగా ప్రతి పౌరుని పేరా నిధుల్ని కేంద్ర ప్రభుత్వం కేటాయించి, స్థానికంగా వాటి వినియోగాన్ని పర్యవేక్షించాలని, దీని వల్ల ప్రజలు తాము ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలు- పారిశుద్ధ్యం, మురుగు పారుదల, చెత్త నిర్వహణ, రోడ్లు, వీధి దీపాలు వంటి సమస్యల్ని ఎవరి కోసమో ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా వెంటనే పరిష్కరించుకోవచ్చని లోక్‌సత్తా ప్రతిపాదించింది. 14వ ఆర్థిక సంఘానికి కూడా ఈ ప్రతిపాదనతో నివేదికను ఇచ్చింది. జాతీయస్థాయి ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు పెద్దఎత్తున వనరుల్ని బదిలీ చేసే అవకాశం ఈ ఆర్థిక సంఘానికి లభించింది. ఎవరికీ సమస్య లేకుండా స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని బదిలీ చేయటానికి ఇదో మహత్తర అవకాశం. ఒక్కసారి నిధుల్ని బదిలీ చేశాక, విధులు, అధికారాలు కూడా వెన్నంటే వచ్చేస్తాయి. అయితే, ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం చేసే మొత్తం నిధుల బదిలీ రూ.39.48 లక్షల కోట్లలో కేవలం రూ.2,87,436 కోట్లను మాత్రమే స్థానిక ప్రభుత్వాలకు ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. ఇది మొత్తం కేంద్రప్రభుత్వ బదిలీలో కేవలం 7.3శాతమే. ఈ దేశంలో ప్రభుత్వం చేసే మొత్తం వ్యయంలో చాలా చిన్న మొత్తం ఇది. ప్రపంచంలో ఎక్కడైనా మొత్తం ప్రభుత్వ వ్యయంలో స్థానిక ప్రభుత్వాలకు 20-30శాతం వాటా ఉంటుంది. రాష్ట్రాలకి నిధుల బదిలీని ఇంత పెద్దఎత్తున పెంచటాన్ని స్థానిక ప్రభుత్వాలకి మరింత పెద్దఎత్తున నిధుల్ని అందించటానికి అవకాశంగా మలచుకుంటే మూడో అంచెలోని స్థానిక ప్రభుత్వాలు బాగా బలపడేవి. కానీ ఓ గొప్ప అవకాశాన్ని జారవిడిచారు. అలాగే కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ బడ్జెట్ నుంచి నేరుగా ఇలా తలసరి రూ.1000-2000 కేటాయించవచ్చు. అప్పుడు ప్రజలు తమ సమస్యలపై సకాలంలో సరైనరీతిలో స్పందిస్తూ, అవినీతిని ప్రశ్నిస్తూ పాలనలో భాగస్వాములయ్యేందుకు, పౌరసత్వ భావనను పెంచుకునేందుకు ఒక చట్రం వారికి లభించినట్టయ్యేది. రూ.1లక్ష కోట్ల పైచిలుకు బడ్జెట్‌గల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఇలా నేరుగా స్థానిక ప్రభుత్వాలకు తలసరి వాటా కేటాయించటానికి 10శాతం లోపే నిధులు చాలు. కానీ ఫలితాలు మాత్రం ఆట నియమాలు మారటం వల్ల గొప్పగా వస్తాయి. బడ్జెట్‌ల సమయంలో కూడా ఈ మేరకు లోక్‌సత్తా నిర్దిష్ట ప్రతిపాదనను తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు చేసింది. ప్రజల చేతికి అధికారం ఇవ్వటం ఇష్టం లేని నాయకత్వం యథాస్థితిని కొనసాగించటానికే మొగ్గుచూపుతూ మాటలకే పరిమితమవుతోంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా లోక్‌సత్తా ఈ వార్డు స్థాయికి నేరుగా తలసరి నిధుల కేటాయింపుతో ప్రజలకే అధికారం ప్రధాన ఎజెండాగా పోటీ చేసింది.

అభివృద్ధి – సీదాసాదా మనుగడ మధ్య ఊగిసలాడుతూ సంధి దశలో ఉన్న భారతదేశం తన సామర్థ్యాల్ని వికసింపచేసుకుని ప్రపంచస్థాయికి ఎదగాలంటే, మనకు భద్రత, సంతోషాన్నిచ్చే శాంతియుత సమాజం ఏర్పడాలంటే స్థానిక ప్రభుత్వాల సాధికారత అవసరం, అనివార్యం.

స్థానిక ప్రభుత్వాల సాధికారతకు లోక్‌సత్తా చేస్తున్న నిర్దిష్ట ప్రతిపాదనలు:

- రాజకీయ ఏకాభిప్రాయాన్ని గనక సాధించగలిగితే, ప్రభావశీలమైన, సాధికారత కలిగిన స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులను బదిలీ చేస్తూ రాజ్యాంగ సవరణ చేయాలి. సంస్థాగత నిర్మాణానికి సంబంధించిన అన్ని వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలేసే ఏర్పాటుతో సరళమైన చట్టం చేయాలి.
- ఎన్నికైన కౌన్సిళ్లకు రిజర్వేషన్లను వర్తింపచేయాలి తప్ప కార్యనిర్వాహక ఛైర్‌పర్సన్లకు కాదు. దీనివల్ల నాయకత్వం పెరిగి నిలదొక్కుకోగలుగుతుంది.
- కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు బదిలీ అయ్యే నిధుల్లో 33శాతానికి తక్కువ కాకుండా స్థానిక ప్రభుత్వాలకు వాటా ఇవ్వాలి. నిధులు బదిలీ చేస్తే బాధ్యతలు, సిబ్బంది వాటంతటవే వచ్చేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భారాన్ని

తగ్గించుకోవాలనుకుంటుంది కాబట్టి, వాటిని బదిలీ చేసేస్తుంది.

- స్థానిక ప్రజలు నిర్ణయాలలో భాగస్వాములై, వికేంద్రీకరణ ఫలితాలను పొందేందుకు వీలుగా స్థానిక ప్రజాబృందాలకి, స్టేక్‌హోల్డర్ బృందాలకే నిధుల బదిలీ చేయాలి. ఉదాహరణకి, చిన్న పంచాయతీ, మునిసిపల్ వార్డు కమిటీ, ఒక కాలనీ, లేదా బస్తీవాసుల బృందాలు ప్రజలకు చేరువగా ఉంటాయి. వనరులు, నిర్ణయాధికారాలు వాటి నుంచే రావాలి.
- విద్య, ఆరోగ్యం, నీటి నిర్వహణ, ఇతర రంగాలలో స్థానిక స్థాయిలో సేవల అవసరం ఉన్న బృందాలకే పూర్తి అధికారం, జవాబుదారీతనంతో పారదర్శకంగా సాధికారత కల్పించాలి
- ప్రతి జిల్లాలో, ప్రధాన నగరంలో స్వతంత్ర ప్రతిపత్తిగల సాధికార అంబుడ్స్‌మన్ వ్యవస్థను చట్టబద్ధంగా ఏర్పాటు చేయాలి. వనరులతో పాటు ఎన్నికైన రాజకీయ నేతలు లేదా స్థానిక ప్రభుత్వాలలోని అధికారులు అవినీతికి పాల్పడితే వేగంగా విచారణ చేసి, దోషులకు జరిమానా, శిక్ష విధించే అధికారాన్ని ఇవ్వాలి.
- శాసన మండలి (ఉన్న రాష్ట్రాలలో) ఏర్పాటుని ఆర్టికల్ 171 కింద మార్చి, స్థానిక ప్రభుత్వాల మండలిగా చేయాలి. జాతీయ స్థాయిలో రాజ్యసభ రాష్ట్రాల కౌన్సిల్‌లా ఉన్నట్టు, పట్టణ, గ్రామీణ స్థానిక ప్రభుత్వాల సమాహారంగా శాసన మండలి ఉండేలా చేయాలి.
- గ్రామీణ, పట్టణ స్థానిక ప్రభుత్వాలతో కూడిన ఎన్నికైన, ప్రభావశీల జిల్లా ప్రభుత్వం ఉండటం మూడో అంచె ఫెడరలిజం లక్ష్యం. భారతదేశంలోని ఒక జిల్లా.. ప్రపంచంలోని సగానికిపైగా దేశాలకంటే పెద్దది. విస్తృత వైవిధ్యం కలిగినది. కాబట్టి రాజకీయ భాగస్వామ్యానికి, సంఘటిత కార్యక్రమాలకు నిజమైన యూనిట్ – జిల్లా!
- గందరగోళం లేకుండా చేసేందుకు, స్థానిక ప్రభుత్వాలకు కేంద్రం, రాష్ట్రాల స్థాయి సాధికారతను ఇచ్చేందుకు, పార్లమెంటుకి, శాసనసభకి, స్థానిక ప్రభుత్వాలకి ఒకే ఎన్నికల సంఘం, ఉమ్మడి ఓటర్ల జాబితాలు ఉండటం అవసరం.
- దాదాపు 10,000 జనాభాతో గ్రామాల సమూహం స్వయంపాలనకు యూనిట్‌గా ఉండేలా గ్రామ పంచాయతీల పునరుజ్జీవనానికి కలసికట్టు ప్రయత్నం చేయాలి. ఇది గ్రామంలోని సాంప్రదాయ వివక్షల వ్యవస్థల్ని బలహీన పరిచి ఆర్థికస్థాయిని, కొత్త సాంకేతిక పరిజ్ఞానానికి అవకాశాల్ని పెంచుతుంది. స్థానిక ప్రభుత్వాలను వృత్తినైపుణ్యంతో నిర్వహించే సామర్థ్యాన్ని విస్తృతం చేస్తుంది.
- స్థానిక పోలీసులు చేసే చిన్న నేరాల విచారణ, ట్రాఫిక్ నిర్వహణ, గస్తీ, చిన్నచిన్న శాంతిభద్రతల సమస్యలు వంటివి స్థానిక నియంత్రణలో ఉండే ఏర్పాటు చేయాలి.
- 2009లో వచ్చిన గ్రామ న్యాయాలయాల చట్టాన్ని స్థానిక న్యాయస్థాన చట్టంగా అన్ని పట్టణ ప్రాంతాలకూ విస్తరించాలి. స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేసి, ఇవి చిన్న సివిల్, క్రిమినల్ కేసుల్ని సంక్షిప్త పద్ధతుల్లో జాప్యం లేకుండా హైకోర్టు పర్యవేక్షణలో విచారణ చేయటాన్ని స్వతంత్ర న్యాయవ్యవస్థలో అంతర్భాగం చేయాలి.
- విద్యుత్తు, నీటి సరఫరా, రహదారులు, స్థానిక పోలీసు, స్థానిక కోర్టులు– ఇలా అన్ని సేవలనూ కలిపి అందించేందుకు వివిధ విభాగాల పరిధిని వీలున్నంత వరకు ఏకీకృతం చేయాలి
- అవకాశమున్నంత వరకూ పౌరసేవలన్నీ ఒకే గొడుగు కింద ఉండాలి. జర్మనీలో, పాస్‌పోర్టు సేవల కోసం కూడా ప్రజలు మునిసిపాలిటీ వద్దకు వెళ్తారు. పాస్‌పోర్టు ఫెడరల్ ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ప్రజలకు ఆ సేవను అందుబాటులోకి తెచ్చేది స్థానిక ప్రభుత్వమే.
- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందించే సేవలకి నిర్ణీత కాలవ్యవధిని ఏర్పాటు చేసి, ఆ గడువులోగా అందించలేకపోతే రోజుకి కొంత డబ్బుని జరిమానా చెల్లించేలా సర్వీస్ గ్యారంటీ చట్టాన్ని అమలు చేయాలి
- ప్రతి నగరంలో, స్థానిక ప్రభుత్వాల సముదాయంలో కాల్ సెంటర్లను ఏర్పాటు చేసి, పౌరులు నేరుగా తమకు ఆ నిర్దిష్ట సేవనందించాల్సిన సంస్థ లేదా అధికారితో అనుసంధానమయ్యేలా చేయాలి. ప్రజలకు సేవలు సక్రమంగా అందుతున్నాయో లేదో కూడా పూర్తయ్యేంత వరకూ పర్యవేక్షించాలి.
- ప్రభుత్వ విధానాలను, చట్టాలను రూపొందించటానికి, ప్రజాధనం వినియోగంపై సూచనలివ్వటానికి, సాధికార, ప్రభావశీల సభా సంఘాల ద్వారా, సభా పద్ధతుల్ని, ప్రక్రియల్ని మెరుగుపరచటం ద్వారా ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయటానికీ చట్టసభ సభ్యులకు మరింతగా అధికారిక బాధ్యతలను కల్పించాలి. ❍

# తొలి సంతకం ఎప్పుడు చేస్తారు?

**(పంచాయతీలు, మునిసిపాలిటీలను స్థానిక ప్రభుత్వాలుగా గుర్తించి అధికారాలు, నిధులు, సిబ్బందిని బదిలీ చేయకుండా చంద్రబాబు నాయుడు బాటలోనే కేంద్రీకృత పాలనతో మోసం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి తీరును ప్రశ్నిస్తూ 2007లో లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సమన్వయకర్త భండారి అంకయ్య రాసిన వ్యాసమిది)**



మన ప్రజాస్వామ్యం పురోగమించడం లేదని ఎవరంటారు? ఎన్నికల అనంతరం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమనే భరోసాతో మంత్రిమండలి జాబితాను ముందుగానే సిద్ధం చేసుకొని ఉండేవారు ఒకప్పటి నాయకులు. పదవీ ప్రమాణ స్వీకారం చేయగానే ఏ అంశానికి సంబంధించిన ఫైలుపై తొట్టతొలి సంతకం చేసేదీ సంవత్సరాలకు ముందే ప్రకటిస్తున్నారు ఈనాటి నాయకులు. అధికారంలోకి రాగానే (2009లో) 'స్థానిక సంస్థలకు పూర్తి అధికారాలు బదలాయించే ఉత్తర్వుపై తొలి సంతకం చేస్తా'నని తెలుగుదేశం 'మహానాడు'లో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. పంచాయతీ రాజ్ విషయంలో రాజ్యాంగ స్ఫూర్తికి తన తొమ్మిదేళ్ల పాలనలో ఆయన చేసిన దోహదమేమిటి? 73, 74 రాజ్యాంగ సవరణలు స్థానిక ప్రభుత్వాలకు చట్టబద్ధత కల్పించాయి. ఇది జరిగింది రాజీవ్ గాంధీ హయాంలో అయినా అధికారాల బదలాయింపు ఇప్పటికైనా ప్రారంభమైందా? తెలుగుదేశం, కాంగ్రెస్ ప్రభుత్వాల వ్యతిరేక వైఖరి వల్లనే కాదా అధికారాల కేంద్రీకరణ జరిగింది?

లోక్‌సత్తా చొరవతో వచ్చిన స్థానిక ప్రభుత్వాల సాధికారత సమాఖ్య ఆధ్వర్యంలో 2003 అక్టోబర్ 19న గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ సభ్యులు, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు, సభ్యుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఒక ప్రతినిధి బృందం అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడుని కలిసి 'రాజ్యాంగ స్ఫూర్తితో విధులు, నిధులు, ఉద్యోగ వర్గాలతో సహా తక్షణం బదలాయించాలని' కోరింది. 'అధికారాలు ఇవ్వండి లేదా అధికారాన్ని కోల్పోండని' గట్టిగా చెప్పింది. సంవత్సరం గడిచేలోగా తెలుగుదేశం ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయింది. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు ఇవ్వకపోవడమే ఆ ఓటమికి కారణమని చంద్రబాబు ఇప్పటికి గ్రహించారు కాబోలు, బహుశా అందుకే అధికారంలోకి రాగానే తొలి సంతకం అనే పల్లవిని ఎత్తుకున్నారు. గాత్ర మాధుర్యంలేని గాయకుని నోట మధుర గీతం శ్రోతలకు వీనుల విందు చేస్తుందా?

సరే చంద్రబాబు కంటే ముందే ఈ పల్లవిని వినిపించిన నాయకుడు ఒకరు ఉన్నారు. ఆయన అప్పుడు విపక్ష నేత, ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి. గత మూడేళ్లుగా వేలాది ఫైళ్లపై సంతకాలు చేశారు. స్థానిక సంస్థలకు అధికారాలు బదిలీ విషయమై వాగ్దానం ఆయనకు గుర్తుకు

**ఎన్నికయిన పంచాయితీ రాజ్ ప్రతినిధులే స్వయంగా ఉద్యమించారు. అయినా ఫలితం శూన్యం. 2005 ఏప్రిల్ 3న జరిగిన ఒక సదస్సులో మహిళా ప్రతినిధులు మంత్రిపై ధ్వజమెత్తారు. 'మాకు పూర్తి అధికారాలు ఎందుకివ్వరు? ప్రజలకు జవాబు చెప్పలేకపోతున్నాం. చిన్నచిన్న సమస్యలు కూడా పరిష్కరించలేకపోతున్నాం' అంటూ వాపోయారు. దీనికి మంత్రి స్పందిస్తూ, 'మీకు అనుభవం లేదు, స్వతంత్రంగా అధికారం చెలాయించే స్తోమతూ లేదు, మీకెందుకమ్మా అధికారాలు?' అనగానే మహిళలు ఒక్కుమ్మడిగా ఎదురుతిరిగారు. 'మాకు అధికారాలు ఇచ్చి చూడండి, అమలు ఎట్లా ఉంటుందో మీరే చూస్తారు. ఇంటిని చక్కదిద్దుకునే మహిళ గ్రామ సమస్యలు అర్థం చేసుకుని పంచాయతీ కార్యక్రమాలు నిర్వహించలేదనుకోవడం ఏమాత్రం సరికాదని' ఆత్మవిశ్వాసంతో గట్టిగా అన్నారు.**

రాకపోవడం ఆశ్చర్యకరమే. ప్రస్తుత పంచాయతీ రాజ్ మంత్రి జేసీ దివాకర్ రెడ్డికి పెక్కు సందర్భాలలో అధికారాల బదలాయింపు విషయాన్ని గుర్తుచేయడం జరిగింది. ఎన్నికయిన పంచాయితీ రాజ్ ప్రతినిధులే స్వయంగా ఉద్యమించారు. అయినా ఫలితం శూన్యం. 2005 ఏప్రిల్ 3న జరిగిన ఒక సదస్సులో మహిళా ప్రతినిధులు మంత్రిపై ధ్వజమెత్తారు. 'మాకు పూర్తి అధికారాలు ఎందుకివ్వరు? ప్రజలకు జవాబు చెప్పలేకపోతున్నాం. చిన్నచిన్న సమస్యలు కూడా పరిష్కరించలేకపోతున్నాం' అంటూ వాపోయారు. దీనికి మంత్రి స్పందిస్తూ, 'మీకు అనుభవం లేదు, స్వతంత్రంగా అధికారం చెలాయించే స్తోమతూ లేదు, మీకెందుకమ్మా అధికారాలు?' అనగానే మహిళలు ఒక్కుమ్మడిగా ఎదురుతిరిగారు. 'మాకు అధికారాలు ఇచ్చి చూడండి, అమలు ఎట్లా ఉంటుందో మీరే చూస్తారు. ఇంటిని చక్కదిద్దుకునే మహిళ గ్రామ సమస్యలు అర్థం చేసుకుని పంచాయతీ కార్యక్రమాలు నిర్వహించలేదనుకోవడం ఏమాత్రం సరికాదని' ఆత్మవిశ్వాసంతో గట్టిగా అన్నారు. ఆ ఉదంతం సభానిర్వాహకుల జోక్యంతో సద్దుమణిగింది. ఈ వ్యవహారం పాలకుల అభీష్టానికి, ఆలోచనలకు అద్దం పడుతుంది. పంచాయతీ రాజ్ మంత్రి ఇటీవల అధికారాల బదలాయింపునకు ఎనిమిది శాఖలు గుర్తించామని, ముసాయిదా ఉత్తర్వులు సిద్ధంగా ఉన్నాయని, కేబినెట్ ఆమోదం పొందడమే ఆలస్యమని ఒకసారి కాదు నాలుగు సార్లు ప్రకటించారు. నాలుగోసారి ప్రకటించిన తర్వాత రాష్ట్ర మంత్రిమండలి నాలుగుసార్లు సమావేశమయింది. ఆ ఉత్తర్వుల ఊసే లేదు. ఇదీ రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధి. పాత రాజకీయ సంస్కృతిలో కూరుకుపోయిన ఈ పాలకులకు అధికారాలన్నీ ఎప్పుడూ తమ గుప్పిటలోనే ఉండాలనే ఆరాటమే.


సరిగ్గా మూడు సంవత్సరాల క్రితం దేశ రాజధానిలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రులు, అధికారుల సమావేశం జరిగింది. ఆ సమావేశంలో ప్రధానమంత్రి డా॥ మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీలను అమలుపరచడానికి కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రి మణిశంకర్ అయ్యర్ పట్టుదల చూపారు. వివిధ నగరాలలో పంచాయతీ రౌండ్‌టేబుల్ సమావేశాలు జరిగాయి. చర్చలు సమగ్రంగా జరిగాయి. తీర్మానాలను ఆమోదించారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వాలేవీ వాటిని పట్టించుకోలేదు. వివిధ స్థాయిల్లో అధికారాల విభజన, గ్రామ సభల నిర్ణయాధికారం, ప్రణాళికల రూపకల్పనలో దిగువ స్థాయి భాగస్వామ్యం, నిధుల పంపిణీ విధివిధానాలు, జిల్లా ప్రణాళికా సంఘం ఏర్పాటు మొదలైన అంశాలపై దిశానిర్దేశ ప్రయత్నం బూడిదలో పోసిన పన్నీరయింది.

మంచినీటి కోసం, మరుగుదొడ్డి కోసం, చిన్న గూడు కోసం ఇలాంటి ఎన్నో అవసరాలకు ప్రజలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైపు చూడాల్సిన పరిస్థితి ఉండకూడదు. ప్రజల ముంగిటకు ప్రభుత్వం రావాలి. రాజ్యాంగం నిర్దేశించిన 11, 12 షెడ్యూళ్లననుసరించి పంచాయితీ రాజ్‌కు 29 అంశాలు, పురపాలక సంఘాలకు 18 అంశాలు తక్షణమే బదలాయించాలి. ఏ స్థాయిలో జరగాల్సిన పని అక్కడే అధికారయుతంగా జరిగే ఏర్పాట్లు రావాలి. ఈ విధానాన్ని 'ప్రిన్సిపల్ ఆఫ్ సబ్సిడియారిటీ'గా గుర్తించినా పాలకులు అధికారాలను తమ గుప్పిట్లో పెట్టుకోవడానికే ప్రాధాన్యమిస్తుండటం వలన వికేంద్రీకరణ ఎండమావి అయింది. తన వాటా నిధులు కేంద్రం నుంచి రాబట్టుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం అదే విధంగా స్థానిక ప్రభుత్వాలకు సగం వాటాను కేటాయించాలి. గ్రామాలకు, పట్టణాలకు వేర్వేరు వ్యవస్థల్నీ ఒకే జిల్లా ప్రభుత్వంగా ఏర్పాటు చేస్తే నిధుల కేటాయింపు, సామాజిక భద్రత, ఇతర అంశాలు ప్రజావసరాల దృష్ట్యా పరిశీలించడానికి సానుకూలంగా ఉంటుంది. ఇవి జరగాలనటంతో కాంగ్రెస్‌కు గానీ, తెలుగుదేశంకుగానీ మరో అభిప్రాయం లేదు. కానీ వాటి సంకల్పశుద్ధి మాత్రం ప్రశ్నే.

(కర్టెసీ: ఆంధ్రజ్యోతి) ❍

# జికా వైరస్‌తోనైనా స్వచ్ఛ భారత్ తీరు మారేనా?

“దోమలు గొప్ప సోషలిస్టులు. డబ్బున్నవారు–పేదవారు, అధికారంలో ఉన్నవారు–ప్రతిపక్షంలో ఉన్నవారు అని తేడా లేకుండా అందరినీ సమానంగా కాటువేస్తాయి. వ్యాధుల్ని వ్యాపింపచేస్తాయి. ఉమ్మడి అవసరాలను సరిగా తీర్చాల్సిన రాజకీయాల్ని పట్టించుకోను, ఓటు వేయను అంటే దోమలు వంటి సమస్యలబారిన పడాల్సిందే” అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తరచూ చెప్పే మాటల్ని కొంతమేరైనా ఈమధ్య నేతలు, అధికారులు బహిరంగంగా కూడా ఉటంకించక తప్పటం లేదు. పరిస్థితి అంత తీవ్రస్థాయికి చేరింది. ఇటీవల జికా వైరస్ ఉపద్రవంలా వస్తుండటంతో అందరిలో వణుకు ఎక్కువైంది. డెంగీ, గన్యా, విషజ్వరాలు వంటి వ్యాధుల్ని వ్యాపింపచేసే ఈడిస్ దోమల ద్వారా ప్రబలుతున్న జికా వైరస్ అన్ని దేశాలనూ హడలెత్తిస్తోంది. జికా వైరస్ కేసులు 40లక్షలకు చేరవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) హెచ్చరిస్తోంది. 2014 నుంచి జికా వైరస్ పొడలు కనిపిస్తున్నాయి. కానీ విషజ్వరాల తీవ్రత తక్కువ ఉండటంతో వైరస్ ప్రభావిత బ్రెజిల్ వంటి దేశాలు పట్టించుకోలేదు. అయితే ఇటీవల కేసులు పెరిగి గర్భిణీ స్త్రీలలో మైక్రో సెఫలికి దారితీసి, శిశువులు చిన్నతలతో, ఎదుగుదల సమస్యలతో జన్మిస్తున్న కేసులు పెరుగుతుండటంతో జికా వైరస్‌ను ప్రమాదకరంగా గుర్తించారు. ఈ వ్యాధి ప్రబలంగా ఉన్న దేశాలకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. భారత్ వంటి దేశాల్లో కూడా పిల్లల్ని కనడం వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి రావచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు రెండు లక్షల 20వేల మంది సైన్యాన్ని దోమలపై యుద్ధంలో బ్రెజిల్ ప్రయోగిస్తోంది. జికా వైరస్‌కి టీకా, మందులు ఎట్టకేలకు వచ్చినా, దోమల వల్ల సాంక్రమిక వ్యాధులు ఆగిపోయే పరిస్థితి లేదు. దోమల నుంచి మలేరియా వంటి వ్యాధులను అరికట్టటంలో అభివృద్ధి చెందిన దేశాలు కూడా సవాళ్లను ఎదుర్కొంటున్న మాట వాస్తవమేగానీ, పారిశుద్ధ్య రంగాన్ని బాగుచేసుకోటానికి పటిష్ఠ స్థానిక ప్రభుత్వాలతో మూడో అంచె ఫెడరలిజం లేకపోవటం వల్ల భారత్ మరింత తీవ్ర సవాలును ఎదుర్కోవలసి వస్తోంది. భారత్‌లోనే ఏటా ఆరు కోట్లకు పైగా మలేరియా కేసులు నమోదవుతుండగా, లక్షమందికి పైగా మరణిస్తున్నారు.




ప్రపంచంలోని మలేరియా బాధితుల్లో మూడో వంతు మనదేశంలోనే ఉన్నారు. ఇప్పుడు జికా వైరస్ ముప్పు వణికిస్తున్నా ఇంకా విధానపరమైన లోపాలపై దృష్టి సారించటం లేదు. అందరికీ అందుబాటులో వైద్యసేవలను అందించాల్సిన ప్రభుత్వం ఆ బాధ్యత నుంచి తప్పించుకుంటుండటంతో నానాటికీ కొత్త సవాళ్లుగా తయారవుతున్న సాంక్రమిక వ్యాధులకు ఆసుపత్రుల్లో వైద్యం అందటం ప్రజలపై పెనుభారంగా మారుతోంది. కేవలం స్వచ్ఛ భారత్ నినాదంతో ఈ సంక్షోభం పరిష్కారం కాదు. స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యం ఎంతో విలువైనదైనా, ఆ కార్యక్రమం రూపకల్పనలోనే వైఫల్యం ఉండటం వల్ల ఎన్ని వేలకోట్ల ప్రచారం చేస్తున్నా ఫలితాలు రావటం లేదని ‘అబ్దుల్‌కలాం కలలుగన్న నూతన భారతదేశం–అవరోధాల్ని ఛేదించేందుకు రాజకీయ, పాలనా సంస్కరణలు’ పేరుతో 2015లో లోక్‌సత్తా నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో చాలా స్పష్టంగా చెప్పారు. ముఖ్యంగా అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటం ద్వారా స్వచ్ఛ భారత్‌ని విజయవంతం చేయవచ్చని, సాంక్రమిక వ్యాధుల సమస్యని సమర్థవంతంగా ఎదుర్కోవటంతోపాటు అవినీతి నియంత్రణ, పౌరసత్వం, నాయకత్వం పెరగటం వంటివి కూడా సాధించగలమని వివరించారు. నిధులు, అధికారాలు, సిబ్బంది ఉన్న పంచాయతీలు, మునిసిపాలిటీలు తదితర స్థానిక ప్రభుత్వాలకు పరిస్థితి తీవ్రమైనప్పుడు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తే దోమకాటు వ్యాధుల నుంచి మనదేశం సమర్థవంతంగా బైటపడుతుంది. జికా వైరస్ ఉపద్రవం నేపథ్యంలోనైనా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, స్వచ్ఛ భారత్ మిషన్ ఉప కమిటీల్లో భాగస్వాములుగా ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ దిశగా దృష్టి పెట్టాలి. ❍

# నీతి ఆయోగ్ జమానాలోనూ అందరికీ ఆరోగ్యం అసాధ్యమేనా?

## లోక్‌సత్తా ప్రతిపాదన అమలుచేస్తే పరిమిత వనరుల్లోనే అందరికీ అందుబాటులో ఆరోగ్యం



ఆశయానికి ఆచరణకి మధ్య అంతరం వల్ల మనదేశ ఆరోగ్య వ్యవస్థ అగాధంలోకి కూరుకుపోయింది. అందరికీ ఆరోగ్యం అందిస్తామని కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌ని, బీమా పథకాన్ని ప్రవేశపెట్టగా, కొనసాగింపుగా రాష్ట్ర ప్రభుత్వాలు దారిద్ర్యరేఖకు దిగువగా ఉన్నవారికి తృతీయ స్థాయి వైద్యసేవలని ఉచితంగా అందిస్తామని కొన్ని బీమా పథకాలను ప్రవేశపెట్టాయి. కానీ రూపకల్పనలో అసంబద్ధత, అవగాహనా రాహిత్యం వల్ల ఆరోగ్యరంగంలో ఉన్న కాసిని వనరులూ కూడా దుర్వినియోగ మవుతున్నట్టు గణాంకాలు ఘోషిస్తున్నాయి.

2009-14 సంవత్సరాల మధ్య జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ కార్యాచరణని సమీక్షించిన 'కాగ్' సమర్పించిన నివేదికలో వెల్లడైన గణాంకాలు ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ అవస్థని, అస్తవ్యస్తపు పనితీరుని ధృవీకరిస్తున్నాయి. ఉదాహరణకి, అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కొరత (42శాతం), మౌలిక వసతుల లేమి, సిబ్బంది కొరత, అత్యవసర సేవల విషయంలో నిర్లిప్తత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి కమ్యూనిటీ కేంద్రాలకు సరైన రవాణా సదుపాయాలు లేకపోవటం వంటి సమస్యల్ని కాగ్ ఎత్తిచూపింది. రెండు సంవత్సరాలు గడిచి, రాష్ట్ర విభజన జరిగి ప్రభుత్వాలు మారినా క్షేత్రస్థాయిలోని ఆరోగ్య కేంద్రాలలో పెద్దగా మార్పులేవీ సంభవించలేదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ ఆరోగ్య మిషన్ ప్రమాణాల దృష్ట్యా చూస్తే 85 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 156 కమ్యూనిటీ వైద్యశాలల లోటుతో పాము కాటు, కుక్క కాటు వంటి కనీస వైద్యావసరాలకు కూడా మందులు లేని పరిస్థితి కనపడుతుంది. తెలంగాణలోని వైద్యవ్యవస్థ ఇందుకు మినహాయింపు కాదు. మౌలిక వసతులు లేని వైద్య కేంద్రాలు, మానవ వనరుల కొరత, మందుబాబుల అడ్డాలుగా మారిన ఆరోగ్య కేంద్ర భవనాల తంతు కొనసాగుతూనే ఉంది.

ఇక రాష్ట్ర ప్రభుత్వాలు తాము ప్రవేశపెట్టిన పథకాల పరిధిలో కేవలం అరుదుగా వచ్చే జబ్బులని చేర్చి, అవి కూడా తృతీయ స్థాయికి చేరాక చికిత్స చేస్తూ, పైకి మాత్రం తమ పథకాలను సర్వరోగ నివారిణిగా పబ్లిసిటీ చేసుకుంటూ కాగ్ ఆడిట్ బట్టబయలు చేసిన అవినీతిని దాచిపెట్టి మసిపూసి మారేడుకాయ చేస్తున్నాయి. తెలంగాణలోని ఆరోగ్య శ్రీ, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ వైద్యసేవ పథకాల పరిధిలో కనీసం డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు, ప్రసవ సమయంలో బిడ్డ అడ్డం తిరగటం వంటి అధికశాతం ప్రజలకి అవసరమైన సేవలను చేర్చకపోవటం ఆరోగ్య రంగం పట్ల పాలకుల నేరసమాన నిర్లక్ష్యానికి నిదర్శనం. వైద్యారోగ్యంలో మౌలికాంశాలను విస్మరిస్తూ, ఇప్పటివరకూ దేశంలో ఎవరూ తీసుకురాని అత్యుత్తమ మార్పులకి తాము శ్రీకారం చుట్టామని చెప్పుకోవటం కూపస్థ మండూక ప్రగల్భాలను తలపిస్తుంది. దీనికితోడు అనుభవం ఉన్న ఆరోగ్య మిత్రలను కూడా మూకుమ్మడిగా తొలగించటం వంటి చౌకబారు రాజకీయాలు.

మనకంటే తక్కువ ఆర్థికాభివృద్ధి సాధించిన శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి దేశాలు కూడా ఆరోగ్య సూచికల విషయంలో మనకంటే ముందంజలో ఉన్నాయి. సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాల్లో భాగమైన ఆరోగ్య చర్యల్లో కూడా మనం నత్తనడక తీరుతో ముందుకు సాగుతున్నామని లెక్కలు నిక్కచ్చిగా చెబుతున్నాయి. 17.5శాతం ప్రపంచ జనాభా గల భారతదేశం తలకు మించి 20శాతం ప్రపంచపు రోగాల భారాన్ని మోస్తోంది. మనదేశం, థాయిలాండ్ వైద్య సేవల కోసం వెచ్చించే ఖర్చు ఒకటే అయినా, ఆ దేశంలో ప్రభుత్వ వాటానే 77శాతం ఉండటం వల్ల మనదేశం కంటే మెరుగైనా ఫలితాలను సాధించగలిగింది.

మనదేశంలో ప్రతి సంవత్సరం దాదాపు 37 లక్షలమంది



కేవలం వైద్యం కోసం వెచ్చించిన వ్యక్తిగత ఖర్చు వల్ల దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి జాబితాలోకి చేరుతున్నారని వివిధ సర్వేలు నిర్ధారిస్తున్నాయి. పేదలకున్న ఏకైక ఆస్తి వారి ఆరోగ్యం. అనారోగ్యం పేదవారిని ఉపాధి హీనులను చేయటమే కాకుండా వారు తమ దైనందిన అవసరాలకు దాచుకున్న కాస్త సొమ్ముని నిలువుదోపిడీ చేయించుకోవాల్సిన పరిస్థితిని కల్పిస్తోంది. తారాస్థాయికి చేరుకున్న వైద్యసేవల ఫీజులు మధ్యతరగతి వారికి కూడా తలకు మించిన భారంగా తయారయ్యాయి. ప్రభుత్వం అందరికీ ఒక హక్కులా అందించాల్సిన వైద్యం మనదేశంలో సామాన్యుడికి అందని ద్రాక్షపండుగా మారిందని పరిజ్ఞానం లేనివాళ్లు కూడా బోలెడు ఉదాహరణలను ఏకరువు పెట్టగలరు.

ఈ నేపథ్యంలో విద్యాహక్కు చట్టం కోవలో ఆరోగ్య హక్కు చట్టం తీసుకురావాలని, తద్వారా పేద ప్రజలకు వైద్యసేవలను అందించటంలో లోపాలను అధిగమించవచ్చని జాతీయ ఆరోగ్య విధాన ముసాయిదా (2015) సూత్రప్రాయంగా అభిప్రాయపడింది. ఆలోచన వెనక లక్ష్యం ప్రశంసనీయమే అయినా మనదేశంలోని ప్రాంతీయ, ఆర్థిక, సామాజిక అసమానతల దృష్ట్యా, ప్రస్తుతం ఆరోగ్య సూచికల పరంగా రాష్ట్రాల మధ్య ఉన్న అంతరాల దృష్ట్యా రాష్ట్రాల స్వతంత్రతని హరించే, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణలోకి తీసుకోని మరో విద్యాహక్కు చట్టంలాంటి చట్టం వల్ల ఆరోగ్యరంగంలో ప్రయోజనాలు నామమాత్రంగానే ఉంటాయి. స్థానిక బలాబలాలని, వనరులని, జబ్బుల తీవ్రతని బట్టి తగిన అత్యుత్తమమైన ఆరోగ్య విధానాన్ని సాధించే అవకాశం రాష్ట్రాలతోపాటు స్థానిక ప్రభుత్వాల భాగస్వామ్యం కూడా ఉంటేనే సాధ్యమవుతుంది.

జాతీయ ఆరోగ్య విధాన ముసాయిదా అందరికీ ఆరోగ్యం అందించటం కోసం ప్రతిపాదించిన మరో ముఖ్యమైన అంశం.. వైద్యసేవల కోసం భారత ప్రభుత్వం కనీసం 2.5శాతం స్థూల జాతీయోత్పత్తిని వెచ్చించటం. కానీ నీతి ఆయోగ్ ప్రస్తుత దేశ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అంత మొత్తాన్ని ప్రభుత్వం భరించలేదు అని పేర్కొంటోంది. దేశ ఆర్థిక వ్యవస్థలో ఏ కొంత ఇబ్బంది ఎదురైనా బడ్జెట్‌లో కోతలను ఎదుర్కొనేది విద్య, వైద్య రంగాలే అని చెబుతున్న మన గత అనుభవాన్నే కొత్తగా వచ్చిన నీతి ఆయోగ్ పునరావృతం చేస్తోంది. ఈ నేపథ్యంలో మోదీ ప్రభుత్వం అంత మొత్తాన్ని కేటాయించటం ఎన్నికల హామీలో తప్ప ఆచరణలో కనిపించటం లేదు.

కనుక ఉన్న కాస్త వనరులనే సద్వినియోగం చేసుకుని దేశ ఆరోగ్య వ్యవస్థని సమూలంగా తీర్చిదిద్దే సవాలును స్వీకరించగలిగే లోక్‌సత్తా ప్రతిపాదన ఆమోదయోగ్యమైన పరిష్కారంగా కనబడుతుంది. ప్రస్తుతం వ్యాధి రాకుండా, తీవ్రం కాకుండా నియంత్రించగలిగే ప్రాథమిక ఆరోగ్య సేవలను నిర్లక్ష్యం చేసి అత్యధికంగా ఆర్థిక వనరులని కేవలం 1 శాతం ప్రజల ప్రయోజనాల కోసం బీమా పథకాల్లో పందేరం చేస్తూ ప్రచారాన్ని మాత్రం అందరికీ అన్నట్టు చేస్తున్నారు. అలాకాకుండా బీమా పథకాల కోసం పెట్టిన ఖర్చు పాళ్లలో ప్రాథమిక రంగం మీద వెచ్చించినట్టయితే మెరుగైన ఫలితాలని సాధించి గణనీయమైన మార్పుల్ని తీసుకురావచ్చు.

జాతీయ ఆరోగ్య మిషన్ రూపకల్పనలో ప్రధాన పాత్ర వహించిన లోక్‌సత్తా ప్రతిపాదించిన ఈ నమూనాలో ప్రాథమిక స్థాయి సేవల కోసం ప్రభుత్వ నిధులు-ప్రయివేటు సేవల భాగస్వామ్యం ద్వారా వైద్యుల మధ్య పోటీ వాతావరణాన్ని కల్పించి మంచి వైద్యులకి ప్రోత్సాహకాలని అందించి, పనిచేయని వైద్యులని తిరస్కరించే అవకాశం ఉంటుంది. ప్రతి జిల్లాకీ ఒక ఆరోగ్య ట్రస్టీని నియమించి తగిన ఆరోగ్య నిధిని కేటాయించి వైద్యులు అందించిన సేవల ఆధారంగా డబ్బుని ఇవ్వటం జరుగుతుంది. ఈ విధానం ద్వారా ఒక మంచి వైద్యునికి నెలకు కనీసం రెండు నుంచి మూడు లక్షల ఆదాయం లభిస్తుంది. వీరి ఉత్తమ సేవల ద్వారా ద్వితీయ స్థాయి వైద్యసేవల మీద భారం తగ్గి తద్వారా అందుకు కేటాయించాల్సిన వనరులు కూడా తగ్గుతాయి. ప్రజలు కూడా ఎంతో ఉపశమనం పొందుతారు. అవసరమైన ద్వితీయ స్థాయి సేవల కోసం పడకలు, పరికరాలు, సిబ్బంది మొదలగు విషయాలలో కనీస ప్రమాణాలు పాటించే ప్రభుత్వ, ప్రైవేటు (కార్పొరేటు కానివి) వైద్యసంస్థల ద్వారా సేవలను అందించటం జరుగుతుంది. తృతీయ శ్రేణి సేవల విషయంలో ప్రయివేటు పెట్టుబడి-ప్రభుత్వ సేవల భాగస్వామ్యంలో వైద్యాన్ని అందించటం జరుగుతుంది.

ప్రభుత్వాలు, నాయకులు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో నినాదాలకు పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో మార్పులు తీసుకొచ్చి జాతికి జవసత్వాలందించే పైన పేర్కొన్న సంస్కరణలను చేపట్టాలి. ఆరోగ్య భారతాన్ని సాకారం చేయాలి. ❍

# న్యాయసంస్కరణల కోసం 35 రోజుల యాత్ర




దేశంలో న్యాయసంస్కరణలను సమర్థిస్తున్న ఒక బృందం 'మార్చ్ ఫర్ జస్టిస్' పేరుతో ఇటీవల దేశవ్యాప్త యాత్రను ప్రారంభించింది. న్యాయస్థానాలలో పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించి సకాలంలో న్యాయాన్ని అందించాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్న లక్ష్యంతో 'సత్వర న్యాయవేదిక' (ఫోరం ఫర్ ఫాస్ట్ జస్టిస్) ట్రస్టు ఆధ్వర్యంలో ఈ యాత్రను చేపట్టారు. న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీకి నివాళులర్పించిన తర్వాత వారు యాత్రను మొదలుపెట్టారు. యాత్ర చేస్తున్నవారిలో ఎక్కువమంది సామాజిక కార్యకర్తలు, న్యాయవాదులే ఉన్నారు. దేశవ్యాప్తంగా 35 రోజులపాటు జరిగే ఈ యాత్ర 22 రాష్ట్రాల్లో దాదాపు 170 జిల్లాలు, ప్రధాన పట్టణాల గుండా సాగి న్యూఢిల్లీలో మార్చి 4న జంతర్‌మంతర్ వద్ద ముగుస్తుంది. ఈ యాత్ర ప్రారంభం సందర్భంగా రాజ్‌ఘాట్ వద్ద జరిగిన కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జి.సి భరూకా, ఫోరం ఫర్ ఫాస్ట్ జస్టిస్ ట్రస్టు ప్రతినిధి రైయానీ మాట్లాడుతూ, న్యాయసంస్కరణలను వేగవంతం చేయటంలో పాలకులకు చిత్తశుద్ధి లేకపోవటాన్ని గర్హించారు. న్యాయసంస్కరణల పట్ల పాలకులు ఆసక్తి చూపటం లేదని, దీంతో ఈ విషయమై ఎవరిపై ఒత్తిడి తేవాలో తెలియక ప్రజలు నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని, అందువల్లనే ఇటువంటి యాత్రను చేపట్టాల్సి వస్తోందని అన్నారు.

ఉన్నత న్యాయమూర్తుల నియామకం కోసం లోక్‌సత్తా సుమారు 14 ఏళ్ల పాటు కృషి చేసి పార్లమెంటు, మెజారిటీ రాష్ట్రాల అసెంబ్లీల ఏకగ్రీవ ఆమోదంతో సాధించిన జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జేఏసీ)ని సుప్రీంకోర్టు అప్రజాస్వామికంగా, రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా కొట్టివేసినా, దానిపై పార్లమెంటు రాజ్యాంగసభలా వ్యవహరించి సమగ్ర చర్చ చేసి నిర్ణయం తీసుకోవాలని లోక్‌సత్తా డిమాండ్ చేసినా, నరేంద్ర మోదీ ప్రభుత్వం అందుకు సాహసించలేకపోవటం తెలిసిందే. ❍

# మాదక ద్రవ్యాల బెడదపై సుప్రీంకోర్టు ఆందోళన

దేశంలో మాదక ద్రవ్యాల వినియోగం ప్రమాదకర స్థాయిలో ఉందని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. స్వాధీనం చేసుకున్న మాదక ద్రవ్యాల, మత్తుపదార్థాల దొంగతనాన్ని, వ్యాప్తిని లేదా చేతులు మారటాన్ని నివారించటానికి ఆరునెలల్లోగా ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రధాన న్యాయమూర్తి టీఎస్ ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. తమ ఆదేశాలను అమలుచేయటంలో ఆయా రాష్ట్రాల పురోగతిని పర్యవేక్షించటానికి న్యాయమూర్తుల కమిటీని నియమించాలని హైకోర్టులకు సూచించింది. మాదక ద్రవ్యాల బెడద సమాజంలోతుల్లోకి చొచ్చుకెళ్లినట్టు సదస్సులు, గోష్ఠుల్లో బైటపడిందని పేర్కొంది. పంజాబ్‌లో యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్‌పై సుప్రీంకోర్టు ఇప్పటికే తీవ్రస్థాయిలో స్పందించిన సంగతి తెలిసిందే. ❍

# నమోదులు, డ్రాపవుట్లే వీరి చదువు

పేదరికం, కులవివక్షను ఉద్దేశపూర్వకంగా కొనసాగించే సమాజంలో ఇటీవల హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఆత్మహత్యకు పాల్పడ్డ రోహిత్ వేముల ఎదుర్కొన్న ఒంటరి, నిరాశామయ పరిస్థితుల్ని, ఆర్థిక అవరోధాలని చాలామంది దళిత, ఆదివాసీ విద్యార్థులు ఎదుర్కొంటుంటారు. రోహిత్ ఆత్మహత్య నిర్ణయం తొందరపాటే అయినా, అతను సాంకేతికంగా దళితుడు అయినా కాకున్నా, ఎదుర్కొన్న పరిస్థితులు ఒక సగటు దళితుడు ఎదుర్కొంటున్న తీవ్రమైనవని, పరిష్కరించకుండా తప్పించుకోలేనివని సమాజం గుర్తించకతప్పదు.



మనదేశంలో అణగారిన దళిత, ఆదివాసీలు చదువుకోవటం 2001 నుంచి 2011లో పెరిగింది. కళాశాలలకు హాజరయ్యే దళితుల సంఖ్య 187శాతం పెరగ్గా, ఆ శాతం ఆదివాసీల్లో 164గా ఉంది. ఇతర కులాల్లో ఆ శాతం 119గానే ఉంది.

కాబట్టి చాలామంది దళితులు, ఆదివాసీలు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లోకి ప్రవేశించారు. అయితే వారిలో చాలామంది రోహిత్‌లా తొలితరం వారిగానే ఉన్నత విద్యాప్రపంచంలోకి అడుగుపెట్టారు. వారు జీవిస్తున్న దుర్భర పరిస్థితులలో అది గణనీయ విజయమే. ఈదేశంలో 21శాతం దళితులు ఇంకా గుడిసెల్లోనే జీవిస్తున్నారు. 78శాతం రెండు గదుల ఇళ్లలోనే ఉంటున్నారు. 41శాతానికి విద్యుత్తు సౌకర్యం లేదు, 66శాతంమంది దళితులకు ఇంటి వద్ద టాయిలెట్లు లేవు. ఈ శాతాలు దేశ జనాభా మొత్తంతో పోల్చి చూస్తే కూడా ఎక్కువే. అంటే, దళితుల్లో ఎక్కువ శాతం పేదలుగా, పేదల్లో పేదలుగా ఉన్నారని తేలుతుంది.

ఇక కుల వివక్ష, పేదరిక నిర్మూలనకు కీలకమైన పాఠశాల విద్య విషయానికొస్తే, అన్ని కులాల్లో స్కూలు స్థాయి నమోదు ఒకేలా ఉన్నా, మధ్యలోనే చదువు మానేయటాలు (డ్రాపవుట్లు) మాత్రం దళితులు, ఆదివాసీల్లోనే ఎక్కువగా ఉంది. దళితుల్లో 6-14 సంవత్సరాల మధ్య 81శాతం పాఠశాల విద్యార్థులుంటే, 15-19 ఏళ్లు వచ్చే సరికి 60శాతం ఉంటున్నారు. 20-24 వయసు వచ్చే సరికి ఆ సంఖ్య 11శాతానికి పడిపోతోంది. ఇలా డ్రాపవుట్లు అన్ని కులాల్లో, కమ్యూనిటీల్లో కనిపిస్తున్నా, దళితులు, ఆదివాసీల్లో చాలా ఎక్కువగా ఉంది.

పాఠశాలలు, కాలేజీల నుంచి చదువు మధ్యలో మానేస్తున్న మగ పిల్లల్లో మూడింట రెండు వంతులు ఇంట్లో ఎంతో కొంత అదనపు ఆదాయం కోసం పనిలోకి వెళ్లటానికి మానేస్తున్నట్టు చెబుతుండగా, సగం మంది ఆడపిల్లలు ఇంటిపనులకు సంబంధించిన అవసరాలకు మానేస్తున్నట్టు చెబుతున్నారని ఎన్ఎస్ఎస్ఓ సర్వే పేర్కొంది. అలాగే కడుపేదలుగా పేదరికంలో దిగువన ఉన్న 10శాతం మంది విద్యార్థుల హాజరు 50శాతం మాత్రమేకాగా, పై 10శాతం సంపన్నుల పిల్లలు 70శాతం హాజరవుతున్నారని సర్వే తెలిపింది. చదువుకోవటానికి పేదరికం ఎంత అవరోధంగా ఉందో ఈ గణాంకాలన్నీ చెబుతున్నాయి. అత్యధిక పేదలు ఉన్న దళితులు, ఆదివాసీలు మన విద్యావ్యవస్థ తీరు వల్ల భారీ మూల్యం చెల్లిస్తున్నారు. దీనికితోడు ఈ సామాజిక వర్గాలు కుల వివక్షను కొన్నిసార్లు తీవ్ర దూషణల్ని, అవమానాల్ని ఎదుర్కొంటుంటారు. తనలాంటి పిల్లల్ని తోటి విద్యార్థులే కాకుండా ఉపాధ్యాయులు కూడా మాటలతో, చేతలతో వేధిస్తూ కించపరుస్తుంటారని తమిళనాడు సేలంలో పీపుల్స్ ట్రస్ట్, 'క్రై' ఏర్పాటు చేసిన బహిరంగ విచారణలో ఒక స్కూల్ డ్రాపవుట్ దళిత యువతి తెలిపింది. అక్కడ్నుంచి ఆమె ఇటుక బట్టీల్లో, పొలాల్లో పనిచేస్తోంది. ఐఐటీలు సహా ఉన్నత విద్యాసంస్థల్లో కూడా అదే వాతావరణం ఏదోకరూపంలో, స్థాయిలో కొనసాగుతూనే ఉంది.

ఉన్నత విద్యాసంస్థల్లో సరాసరిన చూసుకుంటే 10మందిలో ఒకరే దళిత లేదా ఆదివాసీ విద్యార్థి ఉంటారు. దీంతో వారిలో ఒంటరి భావన మరింత పెరుగుతోంది. ఆర్థిక భారం, కుల వివక్ష, మార్కులు రాకపోవటం ఇలాంటివన్నీ కలిసి వీరి మీద ఒత్తిడిని తీవ్రంగా పెంచుతున్నాయి.

ఈ మొత్తం నేపథ్యంలో కేవలం విశ్వవిద్యాలయాలలో సంస్కరణలకు, మానసిక చికిత్సలే సరిపోవు. పాఠశాల స్థాయి నుంచి వివక్ష లేకుండా అందరికీ అత్యున్నత ప్రమాణాల విద్యను అందించే వ్యవస్థీకృత ఏర్పాట్లు, గ్రామాలకు-పట్టణాలకు మధ్య అంతరాన్ని తగ్గించి ఉపాధి అవకాశాలను పెంచటం, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసే రాజకీయ సంస్కృతిని పెంపొందించటం, సామాజిక సంస్కరణోద్యమాలు తదితర మార్పుల్ని ఏకకాలంలో కొనసాగిస్తేనే విషాదాలను అరికట్టి కుల నిర్మూలనను సాధించగలం.

(సోర్స్: సుబోధ్ వర్మ)

# తోపుడు బండి పుస్తక యాత్ర

పుస్తకాన్ని చదవి ఆనందించటం అలవాటైన పిల్లల భవిష్యత్తు గురించి పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదని ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ ఓ సందర్భంలో తన వ్యక్తిగత అనుభవం నుంచి చెప్పారు. చదవటం, తన పరిధిలోని అంశాలను అధ్యయనం చేయటం, సృజనాత్మక ఆలోచనలు చేయటం అలవాట్లు జాతి నిర్మాణానికి పునాది. అందుకే ఏమాత్రం జ్ఞానమున్న వారైనా గ్రంథాలయ నిర్మాతలను ఎంతో గౌరవిస్తారు. ఈ-పుస్తకాల్లా గానా, మరో రూపంలోనా అనే సాంకేతికాంశా లను పక్కనపెడితే గ్రంథాలయాల ఏర్పాటు రాజకీయ ఎజెండాలో భాగం కావటం నాగరిక వ్యవస్థకి సంకేతం. అందుకే, ఈ దేశంలో కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలికిన లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రజలతో మాట్లాడేటప్పుడు వీలైనంత మేర తాను చదివిన తాజా పుస్తకాల గురించి చెప్పటం కనిపిస్తుంటుంది.




ఇంత ప్రాధాన్యత గల గ్రంథాలయాలకు ప్రాముఖ్యత తగ్గిపోవటంపై సాహిత్యం పట్ల మక్కువగల ఓ సీనియర్ పాత్రికేయుడు కలత చెందారు. కొంతకాలం పాత్రికేయుడిగా పనిచేశాక, గ్రంథాలయ అభివృద్ధిపై దృష్టి సారించారు. సమకాలీన సమాజంలో యువతీయువకులు పుస్తకాలు చదవటం మానేసి, టీవీలు, కంప్యూటర్లు, స్మార్ట్ ఫోన్లపై మోజు పెంచుకోవడం పట్ల ఆందోళన చెందారు. ఎలాగైనా నేటి యువతకు పుస్తకాలపై అభిరుచిని, ఆసక్తిని పెంపొందించాలని నిర్ణయించుకున్నారు. ఆయనే షేక్ సాదిక్ అలీ. ఓ కొత్త ఆలోచనతో ముందుకు కదిలారు. 'తోపుడు బండి పుస్తక యాత్ర – పల్లెకు ప్రేమతో' పేర ఓ కార్యక్రమానికి జనవరిలో శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ ఉప్పల్ క్రాస్‌రోడ్ నుంచి ఓ తోపుడు బండిలో తెలుగు పుస్తకాలను వేసుకుని పల్లెల్లోని యువతీయువకులతో తెలుగు పుస్తకాలు చదివించేందుకు ప్రయాణమయ్యారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని తయారుచేసేందుకు పుస్తకాలు చదవాలన్నది ఆయన ఆలోచన. అందులో భాగంగా రంగారెడ్డి, నల్గండ, వరంగల్ జిల్లాల్లో వంద రోజుల్లో వెయ్యి కిలోమీటర్లు తిరగాలని నిర్ణయించుకున్నారు. ఇందులో వారు ఎన్ని గ్రామాలు తిరిగితే అన్ని గ్రామాల్లో, ఒక్కో గ్రామంలో 200 పుస్తకాలతో చిన్న లైబ్రరీని ఏర్పాటు చేస్తారు. ఈ పుస్తకాలను కవులు, సాహితీవేత్తలు, బుక్‌షాపులు, ప్రింటర్లు, రచయితల దగ్గర సేకరించి ఉచితంగా గ్రామాలకు అందచేస్తారు. గ్రామ ప్రజలు, స్థానికుల సాయం తీసుకుని లైబ్రరీలను ప్రారంభిస్తారు. అంతేకాకుండా ఒక్కో లైబ్రరీకి ఐదు కుర్చీలు, రెండు బల్లలు, ర్యాక్‌లు కూడా ఉచితంగా అందచేస్తారు. ఇంకా ఎక్కువ పుస్తకాలను సేకరించగలిగితే మరిన్ని గ్రామాలలో లైబ్రరీలు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని ఆయన ఆలోచన. డిసెంబర్‌లో జరిగిన హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో కూడా ఆయన ఒక పుస్తకాల షాపుని ఏర్పాటు చేసి అక్కడ వచ్చిన ఆదాయాన్ని గ్రంథాలయ ఉద్యమానికి కేటాయించారు. సదుద్దేశంతో ఆయన మొదలుపెట్టిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, పత్రికా సంపాదకులు మద్దతు ప్రకటించారు. ప్రెస్ క్లబ్ ఛైర్మన్ అల్లం నారాయణ, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ సంపాదకులు కె.శ్రీనివాస్, కట్టా శేఖర్ రెడ్డి, హైదరాబాద్ బుక్ ఫెయిర్ కమిటీ ఛైర్మన్ జూలూరి గౌరీశంకర్ తదితరులు సాదిక్ కృషి విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పల్లెలతోపాటు పట్టణాలకు, నగరాలకు, ఇతర భాషా పుస్తకాలకు కూడా ఈ కృషి విస్తరించాలని మనసారా కోరుకుందాం. ❍

# ఆరాటం అసలుకు ముప్పు

**- శేఖర్ గుప్తా**

'నేపాల్‌లో నెహ్రూ' అనే ఆసక్తికర కథనం ఉంది. అయితే నమోదై ఉన్న చారిత్రక ఆధారం చూపి దాన్ని ధృవీకరించలేను. కాకపోతే, ఈశాన్య భారతంలో మీరు కొంతకాలం గడిపేట్టయితే పాత తరం వారి ద్వారా ఆ కథనం మీకు నమ్మకం కలిగించేంత తరచుగా వినిపిస్తుంది. 1952 అక్టోబర్‌లో నెహ్రూ అపాతని తెగ ప్రధాన భూభాగమైన జిరోను సందర్శించారు. తనతోపాటు ఆయన తన కుమార్తె ఇందిరను కూడా తీసుకెళ్లారు. తెగ పెద్ద ఆయనను సాదరంగా ఆహ్వానించాడు. ఇందిరంటే ఇష్టపడ్డాడు. నువ్వు మీ తెగకు పెద్దవు, నేను నా తెగకు పెద్దను. నీ కూతుర్ని నాకిచ్చి పెళ్లి చెయ్యొచ్చుగా? నీకు భారీగా కన్యాశుల్కాన్ని చెల్లిస్తానన్నట్టు మాట్లాడాడు. ఇవ్వజూపిన కన్యాశుల్కంలో కొన్ని వందల మితున్లు కూడా ఉన్నాయి. ఆవుల కంటే ఎక్కువగా గేదెలను పోలి ఉండే పశువులు మితున్లు. పాల కోసం కాక, మాంసం కోసం, బలివ్వడానికి, వ్యాపారానికి వాటిని పెంచుతారు. అలాంటి ఓ మితున్‌ను రాజ్‌భవన్ ముందు బలిచ్చినందుకు ఆగ్రహించిన ప్రస్తుత గవర్నర్, ముఖ్యమంత్రికి ఉద్వాసన పలికారు. అయితే, నాడు నెహ్రూ మాత్రం అపాతని తెగ పెద్ద మాటలకు నవ్వి, అతని కోరిక తనను ఎంతగానో కదిలించిందని, కానీ ఇప్పటికే తన కుమార్తెను వేరొకరికి ఇచ్చి పెళ్లి చేసేశానని చెప్పినట్టు తెలిసింది. మితున్‌ని బలివ్వడాన్ని, నేటి గవర్నర్ రాజ్‌కోవాకు భిన్నంగా నెహ్రూ అతిథికి చేసే అత్యున్నత సత్కారంగానే చూశాడు తప్ప అవమానంగా భావించలేదు. ఈ ఉదంతంలో ఆ తదుపరి కొంత వర్ణనాత్మకత చేరి ఉండవచ్చు, అయినా అది ఈశాన్యమంటే నెహ్రూకున్న ప్రేమను వ్యక్తం చేస్తుంది. అలా అని వారసత్వంగా సంక్రమించిన ఆ ప్రాంత సమస్యలతో సక్రమంగా వ్యవహరించడం ఎలాగో ఆయనకి తెలుసని కాదు. ఆయన కొన్ని సమస్యలను పరిష్కరించారు. మిగతావాటిని సంక్లిష్టం చేశారు. అదే క్రమంలో ఆయన ఆ ప్రాంతాన్ని పరిరక్షించి, పాలించి, రిపబ్లిక్‌లో విలీనం చేసే మూడు సిద్ధాంతాలకు పునాది వేశారు.


ఈశాన్యంలోని ఆవులాంటి మితున్. రాజ్‌కోవా(ఎడమ), నెహ్రూ(కుడి)

**ఈశాన్యానికి నెహ్రూ మూడు సిద్ధాంతాలు**

మొదటిది, ఆ ప్రాంత జాతి వైవిధ్యానికి రాజకీయాలలో విశాలమైన స్థానాన్ని కల్పించడం. దాని పర్యవసానంగానే 10 లక్షలు లే అంతకంటే తక్కువ జనాభాగల నాగాలాండ్, మేఘాలయ, మిజోరాం, త్రిపుర, చివరకు అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు ఏర్పడ్డాయి. భాషా ప్రాతిపదికకు భిన్నంగా ఆ ప్రాంతంలో రాష్ట్రాలను జాతి ప్రాతిపదికపై విభజించాల్సి వచ్చింది. ఇక రెండవది, తిరుగుబాటు బెల్ వక్రరేఖా సిద్ధాంతమని నేను పిలిచేది. నాడు అస్సాంలో భాగమైన నాగా పర్వత ప్రాంతంలో 1950లో తిరుగుబాటు బద్దలైంది. నెహ్రూ సైన్యాన్ని పంపాడు. ఆ పోరాటం ఎంత తీవ్రంగా సాగిందంటే తిరుగుబాటుదార్లు ఐఏఎఫ్‌కు చెందిన ఒక డకోటా విమానాన్ని కూల్చేశారు. పైలెట్లను 'బందీలు'గా పట్టుకున్నారు. అయితే, నెహ్రూ.. ఫిజో నేతృత్వంలోని తిరుగుబాటుదార్లతో చర్చలను మాత్రం నిలిపివేయలేదు. ప్రభుత్వం తిరుగుబాటుకు వ్యతిరేకంగా పోరాడుతుంది, నిర్దాక్షిణ్యంగా అణచివేస్తుందే తప్ప, చర్చలకు తలుపులను మాత్రం మూసేయదు... అనేది చివరకు ఆయన వైఖరి ఆవిష్కరించిన సిద్ధాంతం. తిరుగుబాటుదార్లు తాము ఎన్నటికీ గెలుపొందలేమని గుర్తించగలిగినప్పుడు తిరుగుబాటు హింసకు సంబంధించిన బెల్ వక్రరేఖ అధోముఖ స్థానాన్ని చేరుతుంది. ఎటు ఎందరి ప్రాణాలు పోయాయనే స్కోర్‌తో దానికి నిమిత్తం లేదు. ఒప్పందాలు కుదుర్చుకోవడం కోసం రాజకీయవేత్తలు, గూఢచారులు ఎదురుచూసేది సరిగ్గా ఇలాంటి సమయం కోసమే. కొన్ని దశాబ్దాల కాలంలో ఈశాన్యంలోని అన్ని ప్రధాన

తిరుగుబాటు గ్రూపులు రాజకీయాధికారానికి బదులుగా శాంతికి అంగీకరించాయి. ప్రభుత్వం ఈ విషయంలో అతి తీవ్రస్థాయి వెసులుబాటు వైఖరిని చూపాలి. రాజ్యాంగపరమైన సృజనాత్మకతను సైతం ప్రదర్శించాలి. సువిశాలమైన ఆర్టికల్ 370 నీడలో నాగాలలో ఉన్న కొన్ని ఆందోళనలకు భరోసాను కల్పించేలా ఆర్టికల్ 371 ఎ (1) అలా చేర్చినదే.

**మెల్లగా త్వరితం చేయడం**

ఇక మూడవ సిద్ధాంతం. అది ఈశాన్యంలోని అత్యంత మారుమూలనున్న విశాలమైన ఉత్తర అంచు నుంచి ఆవిర్భవించినది. అది పశ్చిమాన భూటాన్ నుంచి హిమాలయాలతోపాటే తూర్పున మయన్మార్ వరకు విస్తరించిన వలయాకారపు అంచు. అందులో చాలా భాగం టిబెట్ (చైనా) సరిహద్దున ఉన్నది. బ్రిటీషు పాలకులు సైతం ఆ ప్రాంతానికి వాయవ్య సరిహద్దు ప్రాంతం (ఎన్‌డబ్ల్యూఎఫ్‌పీ) లాంటి ప్రత్యేక పాలనా వ్యవస్థని ఏర్పాటు చేశారు. కన్యాశుల్కం, ప్రతీకార పరిహారం సహా ఆదివాసీ చట్టాలే ప్రధానంగా అమలుకావడాన్ని అనుమతించారు. ఆ ప్రాంతాన్ని ఎన్‌ఈఎఫ్‌ఏ (నేఫా) లేదా ఈశాన్య సరిహద్దు ఏజెన్సీ అన్నారు. అది ప్రధాన భారతానికి అతి సుదూరంగా ఉన్న, అతి తక్కువ జనసాంద్రత కలిగిన ప్రాంతం. అయినా, ఈ వారంలో జరిగిన అల్లర్ల వరకు అక్కడ ఎన్నడూ వేర్పాటువాదం లేదా హింసాత్మకవాదం సవాలు ఎదురుకాలేదు. కానీ చైనావారు అది తమదేనని వాదించటం మొదలైంది. 1962లో చైనా ఆ ప్రాంతంపై దురాక్రమణకు పాల్పడింది. ఈశాన్య ప్రాంతాన్ని నెహ్రూ సాధారణ ఐఏఎస్ అధికారులకు వదిలేయలేదు. అక్కడి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా తీర్చిదిద్దాల్సిన భారత సరిహద్దు పాలనా సేవల (ఐఎఫ్ఏఎస్) అధికారులను పంపాడు. వారిలో ఎక్కువమంది అధికారులు సాహసికులు. అన్వేషణాత్మక వైఖరి కలవారు. ఈ ఉన్నతాధికారుల గురించి నేను ఎరిగిన వాటిలో చాలావరకు నారీ రుస్తుంజీ నుంచి తెలుసుకున్నవే. ఆ అధికారులలో అత్యంత ప్రముఖుడైన ఆయన "ఇంపెరిల్డ్ బోర్డర్స్: ఇండియాస్ నార్త్‌ఈస్టర్న్ బోర్డర్ ల్యాండ్స్" (ఓయూపీ, 1983) అనే అద్భుతమైన పుస్తకాన్ని రాశారు. నెహ్రూ అక్కడి తెగల గురించి మరింత అవగాహన కోరుకున్నారని, ఇంగ్లీష్ మానవ జాతుల శాస్త్రవేత్త వెరియర్ ఎల్విన్‌ను సంప్రదించారని తెలిపారు. భారతదేశంలోని ఆదివాసులపై ఆయన అత్యంత ముఖ్యమైన అధ్యయనాన్ని చేశారు. ఆదివాసులకు సంబంధించి ఎల్విన్ సలహాలపై నెహ్రూ విశ్వాసం ఉంచారు. ఆదివాసులను 'బయటి ప్రభావాల నుంచి, వారిని 'నాగరికులను చేయడం' అనే బయటివారి ప్రమాదకరమైన, తప్పుడు అభిప్రాయం నుంచి పరిరక్షించడం ఎల్విన్ పద్ధతిలోని ముఖ్యాంశం. రుస్తుంజీ దాన్ని 'మెల్లగా త్వరితంచేయడం' అన్నారు. నెహ్రూ ఆ భావనను స్వీకరించారు.

నెహ్రూకు కూడా నేఫా ప్రాంతానికి చైనీయుల నుంచి ముప్పు ఉందనే ఆందోళన ఉండేది. చైనా మద్దతుతో సాగుతున్న నాగా తిరుగుబాటు వైరస్ నేఫాకు సోకితేనో? తూర్పుకొసన నాగాలాండ్‌తోపాటు, అరుణాచల్‌ప్రదేశ్‌కు కూడా చైనాతో సరిహద్దు ఉంది. చైనావారు నడుచుకుంటూ ఇటు వచ్చేయవచ్చనేట్టుండేది. నాగాల తరపు ప్రతినిధులుగా విదేశీ క్రైస్తవ పాస్టర్లతో చర్చలు జరపాల్సి రావటం గురించి నెహ్రూ కలత చెందుతుండేవారు. కాబట్టి నేడు అరుణాచల్‌ప్రదేశ్‌గా పిలుస్తున్న నేఫా ప్రాంతాన్ని క్రిస్టియన్ మత ప్రబోధకులకు దూరంగా ఉంచాలని నిర్ణయించుకున్నారు. హిందీ మీడియం విద్య ద్వారా అక్కడి తెగలను జాతీయ-జాతీయవాద-ప్రధాన స్రవంతిలోకి తెచ్చారు. అది, ఈశాన్యంలో హిందీ మాట్లాడే ఏకైక రాష్ట్రం. కేంద్ర మంత్రి కిరణ్ రిజీజుతో హిందీలోనే మాట్లాడవచ్చు. నెహ్రూ తర్వాత కూడా ఇదే వైఖరి కొనసాగింది. అరుణాచల్‌లో చర్చి ప్రవేశం కంటే, హిందూ మత బోధకులు, రామకృష్ణ మిషన్, ఆర్ఎస్ఎస్‌ల ప్రవేశాన్ని కోరుకుంటానని ఇందిరాగాంధీ, నానాజీ దేశ్‌ముఖ్‌తో అన్నారనే కథనాన్ని నేను పూర్తిగా విశ్వసిస్తాను. 1978లో (కేంద్రంలో జనతా ప్రభుత్వం ఉండగా) అరుణాచల్ శాసనసభ మత స్వేచ్ఛ చట్టాన్ని చేసి, మతమార్పిడిని దాదాపు అసాధ్యం చేసింది.

ఆ చట్టం ఇంకా బతికి బట్టకడుతోందంటే దానికి కారణం కాంగ్రెస్-ఆర్ఎస్ఎస్‌ల మధ్య ఉన్న అంతకంటే పెద్ద సూత్రబద్ధమైన అంగీకారం వల్లనే. అందుకే కేంద్రంలో అధికారం చేతులు మారినప్పుడల్లా, అరుణాచల్ ప్రభుత్వం మొత్తంగానే ప్లేటు ఫిరాయించేస్తుంటుంది. జిగాంగ్ అపాంగ్ 'అరుణాచల్ కాంగ్రెస్' పేరిట యూపీయే భాగస్వామిగా ఉన్నారు. ఆ తర్వాత అదే శాసనసభా పార్టీతో బీజేపీ ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు. కాంగ్రెస్ తిరిగి కేంద్రంలో అధికారంలోకి రావడంతోనే ఆయన మళ్లీ దానిలో చేరిపోయారు.

**విచ్ఛిన్నమవుతున్న కాంగ్రెస్-ఆర్ఎస్ఎస్ ఐక్యత**

అక్కడ బీజేపీ ఎదుగుదలతో ఆ ఐక్యత ఇప్పుడు విచ్ఛిన్నమవుతోంది. ఆర్ఎస్ఎస్‌కు ఆ ప్రాంతం అంటే

వ్యామోహం ఎక్కువ. దాని కీలక భావజాలకర్తలు కొందరు ఆ ప్రాంతం కోసం తమ జీవితాలను అంకితం చేశారు. అయితే, అరుణాచల్ తెగలలో కొన్ని బౌద్ధాన్ని అనుసరించేవి. కొద్దిసంఖ్యలో వైష్ణవులూ ఉన్నారు. గతంలో ప్రకృతి ఆరాధకులుగా (యానిమిస్టులు) పిలిచినవారే ఎక్కువమంది అతి పెద్ద తెగలైన ఆది (జిగాంగ్ అపాంగ్), నియిషి (నబోం టుకి), అపాతని (మాజీ సీఎం టోమో రిబా) తెగలవారు దొన్యి-పొల అనుయాయులు లేదా సూర్య,చంద్రుల ఆరాధకులు. హిందువులు అనాదిగా గ్రహ దేవతలను ఆరాధిస్తున్నారాయె. కాబట్టి ఇది ప్రకృతి ఆరాధన ఎలా అవుతుంది? అనేది ఆర్ఎస్ఎస్ దృష్టి. పైగా శని ఆలయం ప్రస్తుతం పతాకశీర్షికల్లో ఉంది. నాగాలు, జిజోలు, ఖాసీలు, గారోలకు విభిన్నమైన రీతిలో కాంగ్రెస్ ఇన్ని దశాబ్దాలుగానూ అరుణాచల్ తెగలను మెల్లమెల్లగా హైందవీకరణ, భారతీయీకరణ చెందిస్తూ వచ్చింది. ఆర్ఎస్ఎస్ ఇప్పుడిక అరుణాచల్‌లో కాంగ్రెస్‌కు బీ టీం కాదు. అది ఇప్పుడు హైందవీకరణ వేగంగా జరగాలని కోరుకుంటోంది. అది ఎంపిక చేసి మరీ నియమించిన అరుణాచల్ గవర్నర్ అసహనంగానీ, అస్సాం, త్రిపుర గవర్నర్ల కొన్ని ప్రకటనలుగానీ ఈ కోణంనుంచి చూస్తేనే అర్థమవుతాయి. నబోమ్ తుకి నియిషీ తెగవాడే అయినా ఆయన అరుణాచల్‌లో అరుదుగా కనిపించే క్రైస్తవంలోకి పరివర్తన చెందిన వ్యక్తని తెలిసిందే.

(సాక్షి సౌజన్యంతో).... ❍

# అవిభక్త హిందూ కుటుంబంలో 'కర్త'గా మహిళ అర్హురాలే

మహిళలను పూజిస్తామని చెప్పే మన సమాజంలో ఎన్ని చట్టాలున్నా కూడా స్త్రీలకు అగ్రస్థానం ఇంకా అందనంత దూరంలోనే ఉంది. పురుషాధిక్యత అంతలా జీర్ణించుకుపోయి ఉంది. పురుషులు అవిభక్త హిందూ కుటుంబానికి చెందిన వ్యవహారాల నిర్వహణకు 'కర్త'గా ప్రకటించుకుంటూ, మహిళలు తమకంటే పెద్దవారైనా కూడా పరిగణలోకి తీసుకోవటం లేదు. చట్టాలకు వక్రభాష్యాలను చెబుతూ తప్పించుకుంటున్నారు. స్త్రీలను వెనక్కినెడుతున్న ధోరణులకు కళ్లెం వేసేలా ఇటీవల ఢిల్లీ హైకోర్టు తీర్పునిస్తూ.. 'కర్త' స్థానానికి స్త్రీ అర్హురాలేనని స్పష్టంగా పేర్కొంది. అవిభక్త హిందూ కుటుంబానికి చెందిన 'డి.ఆర్ గుప్త అండ్ సన్స్' వ్యవహారాల నిర్వహణకు చిన్నాన్న కుమారుడు తనను తాను 'కర్త'గా ప్రకటించుకోవడాన్ని సవాలు చేస్తూ సుజాత శర్మ హైకోర్టుని ఆశ్రయించారు. వారసత్వానికి సంబంధించి హిందూ ధర్మశాస్త్రాలు, మితాక్షర శాసనం (వారసత్వంపై యజ్ఞవల్క్య స్మృతి) పురుషుడికి కుటుంబ వ్యవహారాల పాలన అనుమతినిస్తున్నాయి. అయితే ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి నజ్మి వాజిరి.. పురుషులతో సమానంగా మహిళలకు హక్కులున్నాయని స్పష్టం చేశారు. 'హిందూ వారసత్వ సవరణ చట్టం-2005'.. పూర్వీకుల ఆస్తిలో స్త్రీలకూ సమాన హక్కులు కల్పిస్తూ సెక్షన్-6 స్పష్టంగా నిర్వచించినట్టు వివరించారు. ముందు కొడుకు కర్తగా ఉన్నప్పుడు, ముందు జన్మించిన కూతురు ఎందుకు కర్త కాకూడదని ప్రశ్నించారు. కుటుంబంలో పెద్దదైన మహిళ అవిభక్త కుటుంబ 'కర్త' బాధ్యతలు నిర్వహించకుండా చట్టం ఎక్కడా నియంత్రించలేదని అన్నారు.

# ప్రాథమిక, మాధ్యమిక విద్యకు తగిన కేటాయింపులు లేకే ఆవిష్కరణల్లో వెనకబడ్డాం

ఆవిష్కరణలలో మనదేశం బాగా వెనకబడటానికి అత్యంత కీలకమైన కారణం- చాలా దేశాల కంటే ప్రాథమిక, మాధ్యమిక విద్యారంగాలలో మనం చాలా చాలా తక్కువ వెచ్చిస్తుండటమేనని 'కాంట్రిబ్యూటర్స్ అండ్ డిట్రాక్టర్స్: ర్యాంకింగ్ కంట్రీస్' అనే నివేదిక పేర్కొంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఐటీఐఎఫ్) సంస్థ ఈ నివేదిక కోసం ప్రపంచ ఆర్థికరంగంలో 90శాతం వాటా ఉన్న 56 కీలక దేశాలను పరిశీలించింది. ఇందులో భారత్ 54వ స్థానంలో ఉంది. భారత ప్రభుత్వం ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలో కేవలం రూ.84,978 వెచ్చిస్తూ ఆ డబ్బును కూడా సద్వినియోగం చేయటం లేదు. వియత్నాం, ఇండొనేషియా, పెరూ వంటి దేశాలు కూడా భారత్ కంటే ఎక్కువ వెచ్చిస్తున్నాయి. మనదేశంలో ప్రతి లక్షమంది జనాభాకూ పరిశోధకులు కేవలం 15 మందే. అలాగే పరిశోధనా పత్రాల విషయంలో కూడా మనం వెనకబడి ఉన్నాం. విధానపరంగా ఫిన్లాండ్, స్వీడన్, బ్రిటన్, సింగపూర్ వంటి దేశాల్లో కొత్త ఆవిష్కరణల రంగానికి అత్యుత్తమ ప్రోత్సాహం లభిస్తోంది. భారత్, అర్జెంటీనా వంటి దేశాల్లో అమలవుతున్న విధానాలను చూస్తే ఇవి అంతర్జాతీయ ఆవిష్కరణలను ప్రోత్సహించే మాట అలా ఉంచి పక్కదోవ పట్టించేలా ఉన్నాయి అని నివేదిక వ్యాఖ్యానించింది.

## నీతి ఆయోగ్‌తో రైతుల హక్కులకు భంగం కలిగిస్తే ఊరుకోం, కౌలురైతులకు రుణసౌకర్యం కల్పించాలి: లోక్‌సత్తా



ప్రభుత్వం కౌలురైతులను ఆదుకోవాలని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి సాతులూరు గోవిందరావు డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రుణసౌకర్యం సక్రమంగా అందించేందుకు తగిన నిబంధనలతో గుర్తింపు కార్డులను రూపొందించాలన్నారు. కోదాడలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా రైతుల హక్కులకు భంగం కలిగించే విధంగా చట్టాలు చేస్తే లోక్‌సత్తా పార్టీ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. లోక్‌సత్తా పార్టీ నేతలు రావెళ్ల రవికుమార్, రవీందర్ రెడ్డి, నరేందర్, రవి, అచ్యుత్ వెంకటేశ్వర్లు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మరో రోహిత్‌ని కోల్పోకుండా కులరహిత సమాజం కోసం పోరాడదాం




లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ నాయకుడు గద్దం సతీష్ రెడ్డి హైదరాబాద్ కేంద్రీయ వర్సిటీలోని రోహిత్ స్మారక స్థూపానికి శ్రద్ధాంజలి ఘటించి నివాళు లర్పించారు. తర్వాత రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విద్యార్థులకు సంఘీభావం ప్రకటించి పరిష్కారాలపై చర్చించారు. మరో రోహిత్‌ని కోల్పోకుండా కులరహిత సమాజం కోసం దేశవ్యాప్తంగా పోరాటం చేయవలసి ఉందని ఈ సందర్భంగా సతీష్ రెడ్డి అన్నారు. నిజమైన సమానత్వం, తలెత్తుకుని బతికే పరిస్థితులను కల్పించాల్సిన బాధ్యత ప్రధానంగా యువత మీద ఉందన్నారు.

## చంద్రబాబు పాలనలో పెరుగుతున్న కులతత్వం, ప్రాంతీయ అసమానతలు, పరిశ్రమలు మూతపడుతూ ఊడుతున్న ఉద్యోగాలు : లోక్‌సత్తా ధ్వజం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులో ఎటువంటి మార్పు రాలేదని, గతంలోలాగానే జనాన్ని పై నుంచి పెత్తనంతో తిప్పలకు గురిచేస్తూ పొంతన లేని పాలన కొనసాగిస్తున్నారని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉందంటూనే ప్రచారానికి విపరీతంగా ఖర్చు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలు 63 ఉంటే 61 మూతపడ్డట్టు సంబంధిత మంత్రే ప్రకటించారని, ఉన్న పరిశ్రమలు మూతపడుతుంటే, రాజధాని ప్రాంతం మినహా మిగతా రాష్ట్రంలో కనీసం పారిశ్రామిక రాయితీల్ని కూడా కేంద్రాన్ని అడగకుండా, ఎగిరే పిట్టకు మసాలా నూరినట్టు చంద్రబాబు వచ్చే పెట్టుబడుల గురించి గొప్పలు చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణాల మాఫీ, నిరుద్యోగ భృతి, బాబొస్తే జాబొస్తుంది అనే హామీలు అంతులేని కథలా ప్రజల ముందు సాగుతున్నాయని విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. చంద్రబాబు పాలనలో కులతత్వాన్ని, ప్రాంతీయ అసమానతల్ని పెంచుతున్నారన్నారు. లోక్‌సత్తా నేత ఆర్. సుధాకర్ మాట్లాడుతూ, చంద్రబాబు పాలనలో ఏకపక్ష నిర్ణయాలు, నియంతృత్వ ధోరణులు పెరిగిపోయాయని ధ్వజమెత్తారు. పైకి రాజ్యాంగం, న్యాయస్థానం పట్ల గౌరవాన్ని నటిస్తూనే ఆచరణలో తూట్లు పొడుస్తున్నారన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు బూర్లె గోవింద, ఎం. చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని పంటల బీమా అమలుకు మార్గదర్శకాలు జారీ




ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో అమలవుతున్న మూడు రకాల పంటబీమా పథకాలు ఇకపై రెండు పేర్లతోనే అమలవుతాయి. జాతీయ సాధారణ పంటల బీమా పథకాన్ని, సవరించిన జాతీయ పంటల బీమా పథకాన్ని కలిపి 'ప్రధానిమంత్రి పంటల బీమా పథకం' పేరుతో కొత్తదాన్ని రూపొందించారు. ప్రస్తుతమున్న వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం యధాతథంగా కొనసాగుతుంది. రాష్ట్రాల ప్రముఖ భాగస్వామ్యంతో వచ్చే ఖరీఫ్ నుంచి ప్రారంభంకానున్న ప్రధాని పంటల బీమా పథకానికి మార్గదర్శకాలు జారీ అయ్యాయి.

కనిష్ఠ ప్రీమియంతో పంటల బీమా సౌకర్యం కల్పించే కంపెనీని ఎంపిక చేసేందుకు సాధారణ బీమా కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వాలే పారదర్శక బిడ్డింగ్‌ని నిర్వహిస్తాయని మార్గదర్శకాలు చెబుతున్నాయి. ప్రీమియంను రైతులే చెల్లించాల్సి ఉంటుంది. ఎంపికయిన కంపెనీ కనీసం మూడేళ్లపాటు ఈ పథకాన్ని అమలు చేసే హక్కులను పొందుతుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి చిన్న రాష్ట్రాల్లో అన్ని జిల్లాల్లోనూ, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర వంటి పెద్ద రాష్ట్రాల్లో జిల్లాల్లోని క్లస్టర్లలో ఈ పథకాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. ''అన్ని రాష్ట్రాల్లోనూ బిడ్డింగ్‌లో పాల్గొనవలసిందిగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన భారత వ్యవసాయ బీమా కంపెనీ (ఏఐసీఐ)కి కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ సూచించింది. ఇతర ప్రైవేటు బీమా కంపెనీలతో ఏఐసీఐ పోటీపడాల్సి ఉంటుంది" అని మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఏఐసీఐతోపాటు పది ప్రైవేటు బీమా కంపెనీలను కేంద్రం ప్రతిపాదించింది. వీటి నుంచి ఏదైనా బీమా కంపెనీని రాష్ట్రాలు ఎంచుకోవచ్చని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వాలు వీటిలో ఏ బీమా కంపెనీని ఎంపిక చేసుకోవాలన్న విషయమై కేంద్రం కొన్ని సూచనలు చేసింది. ఒక్కో పంటకు చేసే బీమాపై ఎంత ప్రీమియాన్ని అడుగుతాయో రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగానే తెలుసుకుని, అతి తక్కువ ప్రీమియం కోరే సంస్థలనే ఎంపిక చేసుకోవాలి. జిల్లాలవారీగా వర్తించే పంటలకు ఒక్కోదానికి ఎంత ప్రీమియం వసూలు చేస్తాయన్నది సంస్థలు ముందుగానే రాష్ట్ర ప్రభుత్వానికి తెలపాలి. కంపెనీ గత చరిత్రను కూడా తెలుసుకోవాలి.

ప్రధానమంత్రి బీమా పథకం అమలుపై పర్యవేక్షణకు రాష్ట్రస్థాయిలో పలుశాఖల ముఖ్యకార్యదర్శులతో కమిటీ ఉంది. జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కమిటీ ఉండాలి. పథకం అమలుకు ఎంపిక చేసిన కంపెనీ ప్రతినిధులకు ఈ రెండు కమిటీల్లో రాష్ట్ర ప్రభుత్వం సభ్యత్వం ఇవ్వాలి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడే పంటల బీమా పథకాన్ని అమలుచేస్తామని ప్రైవేటు బీమా కంపెనీలు కోరినా రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదు. ప్రైవేటు కంపెనీల రాకపై అప్పట్లో రైతుసంఘాలు విముఖత చూపాయి.

ఏయే పంటలకు బీమా అవసరమో 2016 జూన్‌లోపు రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫై చేయాల్సి ఉంటుందని కేంద్ర వ్యవసాయ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ప్రధాని పంటల బీమా పథకంలోని విశిష్ట ప్రయోజనాల గురించి రైతుల్లో అవగాహన కల్పించాలని అన్ని రాష్ట్రాలకూ సూచించినట్టు తెలిపాయి.

**ప్రధాని పంటల బీమా పథకంలోని విశిష్టతలు :**

- కోతలు కోసి నూర్పిళ్లకు సిద్ధంగా ఉన్న, ఆరబెట్టిన పంటలకూ బీమా వర్తిస్తుంది. ఇలా ఆరబెట్టిన తర్వాత గరిష్ఠంగా 14 రోజుల లోపు అకాల వర్షాలు, వడగళ్లతో పంటకు నష్టం వాటిల్లితే నష్టం నిష్పత్తి ప్రకారం బీమా మొత్తం నుంచి సదరు బీమా సంస్థ రైతులకు చెల్లించాల్సి ఉంటుంది
- ఇలాంటి ఇతర పథకాలకు భిన్నంగా ప్రధాని పంటల బీమా పథకానికి ప్రీమియం బాగా తక్కువ. పరిహారం చెల్లింపు వేగంగా ఉంటుంది
- ఇతర పథకాల్లో సగటు ప్రీమియం రేటు 5.5శాతం. ప్రధాని పథకంలో ఖరీఫ్‌లోని అన్ని పంటలకూ ఈ రేటు 2శాతమే. రబీ పంటలకు 1.5శాతం.
- మొత్తం 14.5 కోట్ల రైతు కుటుంబాల్లో ఇతర బీమా కంపెనీల సేవల వాటా 25-28శాతమే. 50శాతం రైతులకు సేవలందించాలన్నది ప్రధాని పథకం లక్ష్యం
- స్థానిక రైతుల్లోకి చొచ్చుకెళ్లేందుకే కనీసం మూడేళ్లపాటు ఒకే కంపెనీకి ప్రత్యేక హక్కులు కల్పించే నిబంధన విధించారు. ❍

# చంద్రన్న కానుక అంటే మురుగు బెల్లమా?




**కావలి :** చంద్రన్న కానుక అంటే మురుగు బెల్లాన్ని కార్డు దారుల చేతుల్లో పెట్టటమా? అని లోక్‌సత్తా నేత గద్దం సతీష్ రెడ్డి విమర్శించారు. పండగలేవో తన పేరుతో జరిగినట్టు, తన సొంత డబ్బులిస్తున్నట్టు చంద్రన్న కానుకల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు పందేరం చేస్తున్నారని, ఆ ఇచ్చేవి కూడా మురిగిపోయినవి, ముక్కిపోయినవి ఇస్తున్నారని అన్నారు. ఈ కానుకల కోసం దళారి వ్యాపారులు ప్రత్యేకించి పనికిరాని సరకుల్ని సిద్ధం చేసి పెట్టుకుంటున్నారన్నారు. ఇటీవల సంక్రాంతి సందర్భంగా కూడా మురుగు బెల్లం, ముక్క పురుగుల శనగపప్పు ఇచ్చి ఆనందంగా సంక్రాంతి జరుపుకోండంటూ ప్రభుత్వం, అధికారులు, అధికార పార్టీ నేతలు ప్రచారం చేయటం దారుణమన్నారు. ఈ నిర్వాకంపై లోక్‌సత్తా పార్టీ లిఖిత పూర్వకంగా కూడా ఫిర్యాదు చేసిందన్నారు. పాలకులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రచారం కోసం ఇలాంటి పథకాలను అమలు చేస్తున్నారని, నాసిరకం సరకుల ద్వారా ప్రజారోగ్యానికి కూడా ముప్పు తెస్తున్నారని అన్నారు. చంద్రన్న కానుకలతో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల ఇళ్లలో వంటలు చేసుకుని తిని ఆ తర్వాత ప్రజలకు పంపిణీ గురించి మాట్లాడాలని డిమాండ్ చేశారు.

# పనికిరాని చంద్రన్న కానుకలు పేద, దళిత విద్యార్థులకా?

చంద్రన్న కానుకల పేరుతో తయారైన 15లక్షల బ్యాగులు (సుమారు రూ.65కోట్ల విలువ) ఎవరూ తీసుకోకపోవటంతో వాటిని సాంఘికసంక్షేమ హాస్టళ్లకు సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ సర్కారు నిర్ణయం తీసుకోవటం దారుణమని లోక్‌సత్తా పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పంచిన చంద్రన్న కానుకల్లో నాణ్యత లోపించిందని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే ఒప్పుకోవాల్సి వచ్చిందని, పేదలు కూడా తీసుకోవటానికి నిరాకరించిన ఈ పాడైపోయిన సరకుల్ని పేద, దళిత విద్యార్థులుండే హాస్టళ్లకు ఏ విధంగా సరఫరా చేస్తారో ప్రభుత్వం చెప్పాలని పార్టీ వర్గాలు డిమాండ్ చేశాయి. ఇది పేద, దళిత వర్గాలు చదువుకోవటం పట్ల చంద్రబాబు ప్రభుత్వం చూపుతున్న వివక్షకు నిదర్శనమని నేతలు పేర్కొన్నారు. దీన్ని లోక్‌సత్తా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. నాసిరకం సరకులు తయారుచేసిన కాంట్రాక్టర్లపై చర్యలు కూడా తీసుకోలేని అసమర్థ స్థితిలో చంద్రబాబు సర్కారు ఉందన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సత్తా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతుందని పార్టీ నేతలు హెచ్చరించారు.

## తెలంగాణలోనూ... నిఘానివేదిక బుట్టదాఖలు చేస్తున్న పౌరసరఫరాల శాఖ

తెలంగాణలో చౌకదుకాణాల ద్వారా అందజేస్తున్న కందిపప్పు నాసిరకంగా ఉందని నిఘానివేదికలు స్పష్టంచేస్తున్నా పౌరసరఫరాల శాఖ పట్టించుకోవటం లేదు. రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెలా కార్డుదారులకు కందిపప్పును అందించేందుకు టెండర్ల ద్వారా పౌరసరఫరాల శాఖ గుత్తేదారులను ఎంపికచేస్తుంది. ఆ పప్పులో ప్రమాదకరమైన సింథటిక్ రంగులను కలిపినట్టు ఆహార భద్రతా తనిఖీ ప్రయోగశాలలు తేల్చాయి. దీనికితోడు ఒప్పందానికి విరుద్ధంగా సబ్ కాంట్రాక్టులు ఇస్తున్నా అధికారులు పట్టనట్లే ఉన్నారు. విజిలెన్స్ నివేదిక అంది మూడు నెలలు అవుతున్నా చర్యలు తీసుకోకపోవటంపై ఆర్థిక, పౌరసరఫరాల శాఖ అసంతృప్తితో ఉన్నా ఇంతవరకూ అధికారుల మీద చర్యలు మాత్రం కనిపించటం లేదు.

# ఓటింగ్, షూటింగ్ స్థాయికి దిగజారిన భారత ప్రజాస్వామ్యం, విధానాలు, వికేంద్రీకరణతోనే మార్పు: హార్వర్డ్ వర్సిటీలో జేపీ

స్థానిక స్వయంపాలన, సరైన విధానాలు లేకపోవటం వల్ల భారత ప్రజాస్వామ్యం ఓటింగ్, షూటింగ్ స్థాయికి దిగజారిపోయిందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఆకాంక్షల్ని నెరవేర్చగల విధానాలను, నాయకత్వాన్ని చూడకుండా కేవలం తాత్కాలిక ధోరణులతో, భావోద్వేగాలతో ఓటు వేయటం, ఆ తర్వాత ప్రతి రోజూ దిగిపోండి, దిగిపోండి అంటూ ధర్నాలు, రాస్తారోకోలు చేయటం వల్ల ప్రజాస్వామ్యం వక్రమార్గం పడుతోందన్నారు. అమెరికా ఎన్నికల్లో ఒక పార్టీ తరపున అభ్యర్థిగా ఖరారు కావటానికే విద్య, ఆరోగ్య విధానాలపై హోరాహోరీగా రాజకీయ నాయకులు తలపడుతుంటే, భారత్‌లోని పార్టీలు, నేతల మధ్య విధానాలు, ఆలోచనల కనీస పోరాటమే లేదన్నారు. 21వ శతాబ్దపు ఆర్థిక వ్యవస్థలో జీవించాలని కోరుకుంటూ మనం 19వ శతాబ్దపు రాజకీయాలను కొనసాగించలేమని, ఇవి రెండూ పరస్పర విరుద్ధమని అన్నారు.

అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 6,7 తేదీల్లో జరిగిన ఇండియా కాన్ఫరెన్స్‌లో జయప్రకాష్ నారాయణ్ పాల్గన్నారు. పలువురు రాజకీయ నాయకులు, వాణిజ్యవేత్తలు, బాలీవుడ్ ప్రముఖులు, కళాకారులు, ఎన్జీవో నేతలు, భారతదేశ అభివృద్ధిపై పరిశోధనలు చేస్తున్న ప్రముఖ అమెరికన్ వర్సిటీల అధ్యాపకులు, దాదాపు 750మంది విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గన్నారు. జేపీ ప్రసంగానికి సభికులు పలుమార్లు హర్షధ్వానాలతో ఆమోదం తెలిపారు. వివరాలను లోక్‌సత్తా వర్గాలు ఒక ప్రకటనలో మీడియాకు విడుదల చేశాయి.

కేంద్ర ఐటి, కమ్యూనికేషన్స్ మంత్రి రవిశంకర్ ప్రసాద్, ఒడిషా ఎంపీ జే పాండా తదితరులున్న ప్యానల్‌లో 'భారత రాజకీయాల్లో సంధిదశ: కొత్త, పాతతరం రాజకీయాల సంఘర్షణ'పై జేపీ మాట్లాడుతూ, మనం చేసే విశ్లేషణలు ఒకచోట ఒకసారి నిజమైతే, మరోచోట మరోసారి అబద్ధమయ్యేంత సువిశాలమైన, సంక్లిష్ట భిన్నతం కలిగిన దేశం భారత్ అని, చాలా లోతుగా ముందుచూపుతో విధానాలను రూపొందించాలని అన్నారు. దేశం చెప్పుకోదగిన అభివృద్ధిని సాధించినా ప్రజలకు ఇంకా కీలక కనీస అవసరాలు అందుబాటులో లేవన్నారు. ప్రజల ఆకాంక్షలకి, విధానాలకి, ఫలితాలకి మధ్య అగాధం నానాటికీ పెరుగుతోందన్నారు. దేశ సుస్థిరాభివృద్ధికి కీలకమైన విద్యారంగాన్నే తీసుకుంటే, విద్యార్థుల నమోదు గురించే తప్ప




విద్యలో నాణ్యతపైన దృష్టి లేదన్నారు. ఓఈసీడీ వంటి అంతర్జాతీయ సర్వేల్లో, దేశీయ సర్వేల్లో కూడా భారతదేశ విద్యాప్రమాణాలు ప్రపంచంలోనే అధ్వాన్నంగా ఉందన్నారు.

ఆరోగ్య రంగంలో ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో కలిపినా భారత్ జీడీపీలో 4శాతం కంటే తక్కువ ఖర్చు చేస్తోందని, ఇది అమెరికా కంటే నాలుగు రెట్లు, చాలా అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల కంటే కనీసం రెండు రెట్లు తక్కువని జేపీ అన్నారు. కేవలం నియంతృత్వ చైనాను తట్టుకోవటానికే మిగతా ప్రపంచ దేశాలు భారత్ అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాయన్నారు.

స్థానిక స్వయంపాలన భారతీయ సంస్కృతిలో భాగమని, కానీ స్వతంత్ర భారతదేశంలో కేంద్రీకృత పాలన పెరిగిపోతూ ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోందని జేపీ అన్నారు.

ఈ నేపథ్యంలో భారతదేశం మూడు మార్పుల్ని తక్షణం చేయాలని జేపీ అన్నారు. "ఒకటి, ఢిల్లీ అధికారాల్ని కేంద్ర, విదేశాంగ అంశాలకే పరిమితం చేయాలి. రెండు, తమ సొంత పాలనను, అందుకు విధానాలను రూపొందించుకునే స్వేచ్ఛను రాష్ట్రాలకు ఇవ్వాలి. అవి స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయాలి. ఇప్పుడు కేవలం 7శాతం మాత్రమే స్థానిక ప్రభుత్వాల కోసం ఖర్చు చేస్తున్నారు. బలహీన స్థానిక ప్రభుత్వాలతో స్వయంపాలన లేకపోవటం వల్ల ప్రజలు నిరంతర యాచకుల్లా, రాస్తారోకోలు, ధర్నాలవృత్తిదారులుగా తయారవుతున్నారు. మూడోది, ప్రభుత్వ అధికార యంత్రాంగంలో నైపుణ్యాలను పెంపొందించి జవాబుదారీతనానికి పారదర్శక వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజాసేవ కోసం పనిచేసేలా వారిని సంస్కరించాలి" అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ❍



అవినీతి నిరోధక చట్ట సవరణలపై పార్లమెంటు స్థాయీ సంఘం సమావేశానికి
హాజరై సూచనలు అందచేసిన లోక్‌సత్తా పార్టీ నేతలు

Posting Date 22-02-2016
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on February 16th 2016




భారత్‌లో
పాత, కొత్తతరం
రాజకీయాల మధ్య
సంఘర్షణ, సంధి దశపై
హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో
ప్రసంగిస్తున్న
జయప్రకాష్ నారాయణ్




**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad